# భర్త పై పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య భార్య అరెస్టు



**మరికల్ అక్టోబర్ 16 (వుదయం ప్రతినిధి)**

మరికల్ మండల కేంద్ర పరిధిలోని మాదారం గ్రామంలో భర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేసిన భార్యను మరికల్ పోలీసులు అరెస్ట్ చేశారు వివరాలు ఎలా ఉన్నాయి భర్త బాలస్వామి మరో మహిళతో వివాహేతార సంబంధం ఉందని అనుమానంతో దంపతుల మధ్య ఖర్చు వివాదాలు 2026 సెప్టెంబర్ 24 అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంట్లో నిద్రిస్తున్న బాలస్వామిపై రాములమ్మ పెట్రోల్ పోసి నిప్పంటించింది పోలీసోళ్లకు ఫిర్యాదు దర్యాప్తులో తన సొంత భార్యని గుర్తించాలని తెలిపారు ఈ సంఘటనలో బాలస్వామి తీవ్రంగా గాయపడి మహబూబ్నగర్ ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు పరిస్థితి విషమించడంతో చికిత్స కోసం హైదరాబాద్ ఉస్మానియా జనరల్ హాస్పిటల్ కు తీసుకువెళ్లారు అక్కడ చికిత్స పొందుతూ సెప్టెంబర్ 25న మృతి చెందాడు నారాయణ పేట డిఎస్పి నల్లపు లింగయ్య తెలిపారు ఈ కేసు దర్యాప్తులో కృషిచేసిన మరికల్ సీఐ భగవాన్ రెడ్డి ఎస్సై రామ్ లాల్ మహిళా ఎస్సై మహేశ్వరి మహిళా కానిస్టేబుల్ రజిత సిసిఎస్ ఐ విజయభాస్కర్ తో పాటు ఇతర పోలీసులని సిబ్బందిని డిఎస్పి అభినందించారు

# నీటి లభ్యతను బట్టే రబీ సాగు!

**ఆరుతడి పంటలకే ప్రాధాన్యం.. జల సంరక్షణ పనులు వేగవంతం చేయాలి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశాలు**

**గద్వాల అక్టోబర్ 16 (వుదయం కరస్పాండెంట్ )**



ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గిన నేపథ్యంలో రబీ సీజన్‌లో రైతులు బోర్లు, బావుల్లో నీటి లభ్యతను బట్టి ఆరుతడి పంటలనే సాగు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. జల సంరక్షణ పనులు ముమ్మరం చేయాలని, ఉపాధి హామీ పనుల ద్వారా కూలీలకు విస్తృతంగా ఉపాధి కల్పించాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వెబ్‌ఎక్స్ ద్వారా నిర్వహించిన సమీక్షలో ఫార్మర్ రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ సర్వే పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పంటలు ఎండిపోయిన ప్రాంతాల్లో నివేదికలు రూపొందించి ప్రభుత్వానికి పంపించాలని, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జల సంరక్షణకు ప్రాధాన్యం విబిజి రాంజీ పథకం కింద పంట కుంటలు, ఇంకుడు గుంతల నిర్మాణాన్ని విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో పనులపై సర్పంచులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని, ఈ నెల 30వ తేదీలోగా నివేదికలు సమర్పించాలని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పిల్లలకు గుర్తింపు పత్రాలు అందించాలి ఆధార్ కార్డులు, జనన ధ్రువీకరణ పత్రాలు లేని పిల్లలను గుర్తించి ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థుల భద్రతపై నిఘా గురుకులాలు, కేజీబీవీలు, వసతిగృహాల్లో ఆహార నాణ్యత, విద్యార్థుల భద్రతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ప్రత్యేక అధికారులు ప్రతి శుక్రవారం విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతను పరిశీలించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రతి మంగళవారం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాలని, భూ రీసర్వే పనులను వేగవంతం చేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో మంజుల, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దసరా వేళ కార్మికులకు కలెక్టర్ కానుకలు!



**38 మంది హమాలీలు, స్వీపర్లకు యూనిఫాంలు.. నగదు ప్రోత్సాహకాలు కష్టానికి గుర్తింపు.. పండుగకు భరోసా**

**గద్వాల, అక్టోబర్ 16 (వుదయం బ్యూరో)**

పండుగ వేళ కార్మికుల ముఖాల్లో ఆనందం నింపేలా జిల్లా యంత్రాంగం దసరా కానుకలు అందించింది. పౌరసరఫరాల శాఖలో విధులు నిర్వహిస్తున్న హమాలీలు, స్వీపర్లకు రెండు జతల యూనిఫాం దుస్తులను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పంపిణీ చేశారు. శుక్రవారం ఐడీఓసీ కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గద్వాల, అలంపూర్, అయిజ, మనోపాడు ఎంఎల్ఎస్ పాయింట్లలో పనిచేస్తున్న 34 మంది హమాలీలు, నలుగురు స్వీపర్లు కలిపి మొత్తం 38 మందికి దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. హమాలీలు, స్వీపర్లు నిరంతరం శ్రమిస్తూ విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తున్నారని అభినందించారు. వారి సేవలను గుర్తిస్తూ పౌరసరఫరాల సంస్థ ఏటా దసరా సందర్భంగా బోనస్, దుస్తులు అందిస్తోందని తెలిపారు. ప్రతి ఒక్కరికీ రూ.8,500 ప్రోత్సాహక నగదుతోపాటు, స్వీట్ బాక్స్‌కు బదులుగా రూ.1,000 చొప్పున ఇప్పటికే బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. యూనిఫాం కుట్టు ఖర్చుల కింద హమాలీలకు రూ.1,800, స్వీపర్లకు రెండు బ్లౌజుల కుట్టు ఖర్చుల నిమిత్తం రూ.800 చొప్పున చెల్లించినట్లు వివరించారు. కార్మికులంతా కుటుంబ సభ్యులతో కలిసి దసరా పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి స్వామి కుమార్, హమాలీలు, స్వీపర్లు, సంబంధిత శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి



**మరికల్ అక్టోబర్ 16 (వుదయం ప్రతినిధి)**

మరికల్ మండల కేంద్రంలోని శుక్రవారం బి ఆర్ ఎస్ నాయకులు ఇందిరాగాంధీ చౌరస్తా దగ్గర నిరసన తెలిపారు BRS మండల అధ్యక్షుడు లంబాడి తిరుపతయ్య సమావేశంలో మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విద్యుత్తు ఇవ్వాలని కరెంటు కోతలతో పంటలు ఎండి పోతున్నామని కాంగ్రెస్ ప్రభుత్వము సరిగా విద్యుత్ ఇవ్వడం లేదని ఆయన అన్నారు చేతికొచ్చిన పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు 50 వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రత్యేక పూజలు

**సదాశివపేట వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు.. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే**

**సదాశివపేట అక్టోబర్ 16 (వు ద మం):**



దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. సదాశివపేట పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిజాంపురం కుటుంబ సభ్యులు అశోక్, రవి, నాగరాజు ఆధ్వర్యంలో, జైభవీ యూత్ మాజీ కౌన్సిలర్ ఆకుల శివ, దిద్దిగే నగేష్, కటకం కిరణ్, మల్లికార్జున, వంశీ, సాయిరాజు సేటు, ధనుంజయ్ గౌడ్, రచ్చన్న స్వామి, సారపు అభి, చంద్రయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను ఘనంగా సన్మానించారు. ఆ తర్వాత నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం అందించే కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకలని పేర్కొన్నారు. ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింత గోపాల్, శ్రీధర్ రెడ్డి, చింత సాయినాథ్, చీల మల్లన్న, నగేష్, కౌన్సిలర్ వైశాలి నాగరాజు గౌడ్, దిద్దిగే వినోద్, కొత్రికే సాయిరాజ్, తంగెడ్పల్లి లక్ష్మణ్, కంది మల్లేశం, పెద్ద గౌడ్, మల్లికార్జున శంకర్, కొత్త రామన్న, కోడూరు అంజయ్య తదితర స్థానిక నాయకులు, మహిళలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

# సదాశివపేటలో తాగునీటి ఎద్దడిని నివారించాలి



**సదాశివపేట అక్టోబర్ 16 (వు దయం):**

మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా వెంటనే నీటి సరఫరా చేయాలికమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన బీజేపీ నాయకులు సదాశివపేట: పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షురాలు శ్రీమతి ఓదెల రాజేశ్వరి మాణిక్ రావు నేతృత్వంలో పార్టీ ప్రతినిధులు కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టణంలోని పలు వార్డులు, కాలనీల్లో ప్రజలు తాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా దసరా పండుగ వేళ కూడా సరిపడా తాగునీరు అందకపోవడంతో మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజల తాగునీటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అధికారులు తక్షణమే స్పందించాలని వారు కోరారు. నీటి కొరత తీవ్రంగా ఉన్న అన్ని కాలనీలు, వార్డులకు మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా తక్షణమే తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ట్యాంకర్ల ద్వారా క్రమం తప్పకుండా నీటిని అందించడంతో పాటు, పట్టణ తాగునీటి సరఫరా వ్యవస్థను సమగ్రంగా పునరుద్ధరించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల మాణిక్ రావు, పట్టణ ప్రధాన కార్యదర్శి వుశన్న గారి శ్రీశైలం, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు అంబాదాస్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు గణపురం చంద్రశేఖర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు దర్జీ సుధాకర్, బీజేపీ జిల్లా నాయకులు విక్రమ్ రెడ్డి, ఉల్లిగడ్డల నాగన్న తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల గుర్తింపునకు గ్రీన్ సిగ్నల్ సీఎం రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం

**నాగర్ కర్నూల్, అక్టోబర్ 16 (వుదయం ప్రతినిధి):**



తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతగా శుక్రవారం నాడు జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఉద్యమకారులు పాలాభిషేకం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర అధ్యక్షుడు పిడమర్తి రవి, జిల్లా అధ్యక్షుడు ఉల్లెంగొండ రాము పిలుపు మేరకు జిల్లా ఉపాధ్యక్షుడు జయప్రకాష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ సాధన కోసం పోరాడిన ఉద్యమకారులను గుర్తించి గౌరవించాలన్న తమ చిరకాల వాంఛను సీఎం రేవంత్ రెడ్డి నెరవేరుస్తున్నారని, అందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సునేంద్ర, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షులు జక్క రఘు, నర్సాయిపల్లి సర్పంచ్ రాము, సందువట్ల సర్పంచ్ తిరుపతి గౌడ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రపతి భవన్, పార్లమెంట్ ను సందర్శించిన పేట తపస్ బృందం



**నారాయణపేట అక్టోబర్ 16(వుదయం ప్రతినిధి)**

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నారాయణపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో తపస్ బృందం ఢిల్లీలో భారత రాష్ట్రపతి భవనాన్ని, పార్లమెంట్ భవనమును శుక్రవారం సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా రాష్ట్రపతి భవనంలోని సమావేశ మందిరం,

ప్రధానమంత్రి, మంత్రిమండలి ప్రమాణ స్వీకారం చేసే మండపం విదేశీ అధ్యక్షులు దేశానికి వచ్చినప్పుడు జరిగే ఒప్పంద గది సందర్శించి వాటి ప్రాముఖ్యతను విశ్లేషకుల ద్వారా వివరంగా తెలుసుకున్నారు. భవనం యందు లోక్ సభ,రాజ్యసభ సమావేశ మందిరాలను ప్రత్యక్షంగా వీక్షించారు.

ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి షేర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ అద్భుతమైన నిర్మాణశైలి,ఒక్కొక్క నిర్మాణ ప్రాముఖ్యతను తెలుసుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని కల్పించిన పాలమూరు పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మకు తపస్ బృందం ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో తపస్సు రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలరాజు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరసింహ, రవీందర్, నర్సప్ప, గోవింద్ రెడ్డి, లక్ష్మారెడ్డి ,శ్రీనివాస్, రవికుమార్, కుర్మయ్య ,నర్సింగప్ప తదితరులు పాల్గొన్నారు.

# సబ్‌స్టేషన్‌లో 11 కేవీ నూతన బ్రేకర్ ప్రారంభోత్సవం.....



**వుదయం న్యూస్ శివ్వంపేట, అక్టోబర్ 16....**

మెదక్ జిల్లా శివ్వంపేట మండలం తిమ్మాపూర్ సబ్ స్టేషన్‌లో నూతనంగా 11 కేవీ బ్రేకర్ ఏర్పాటు చేయడంతో మూడు గ్రామాల ప్రజలకు విద్యుత్ సమస్యల నుంచి ఉపశమనం లభించనుంది. గతంలో తిమ్మాపూర్, చిన్నగొట్టిముక్ల , చెన్నాపూర్ గ్రామాలకు కలిపి ఒకే బ్రేకర్ ఉండేది. దీంతో ఏదైనా ఒక ప్రాంతంలో విద్యుత్ సమస్య తలెత్తినా మూడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం నూతనంగా 11 కేవీ బ్రేకర్ ఏర్పాటు చేయడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించే అవకాశం ఏర్పడిందని సర్పంచులు నారాయణరావు, ఆకుల కొమురయ్యలు అన్నారు.

కొత్త బ్రేకర్‌తో ఒక గ్రామంలో విద్యుత్ సమస్య ఏర్పడినప్పుడు మిగిలిన గ్రామాలకు ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎల్ఎం లు కిరణ్, సురేష్, భాగ్యరాజు, ఉప సర్పంచ్ పాపయ్య చారి, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు నర్సింగరావు, రాజేందర్ నాయక్, నరేందర్, కుమార్, కిషన్ తదితరులు ఉన్నారు.

# శ్రీసరస్వతీ దేవీగా భక్తులకు దర్శనమిచ్చిన ఏడుపాయల వనదుర్గామాత



**పాపన్నపేట, అక్టోబర్16.(వుదయం ప్రతినిధి):**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ ఏడుపాయల వనదుర్గామాత సన్నిధిలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలలో ఆరవ రోజైన శుక్రవారం రోజు దేవీ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారిని నవరాత్రుల ప్రత్యేక పూజారులు శ్రీ సరస్వతీ దేవి అవతారంలో(తెలుపు వర్ణంలో) అమ్మవారి భక్తులకు దర్శనమిచ్చారు.అమ్మవారీ ఉత్సవ విగ్రహాన్ని నవరాత్రుల ప్రత్యేక పూజారులు అత్యంత సుందరంగా ముస్తాబు చేసి అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.నవరాత్రుల సందర్భంగా కర్ణాటక, మహారాష్ట్ర,హైద్రాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక మంటపంలో ఏర్పాటు చేసిన అమ్మవారినీ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ప్రత్యేక పూజారులు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి,ప్రతాప్ రెడ్డి,సాయిబాబా,నరేష్, మహేష్,యాదగిరి,దీపక్ రెడ్డి,బలరాం తదితరులు పాల్గొన్నారు. నవరాత్రుల సందర్భంగా ఏడుపాయల్లో నవ రాత్రుల సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం కల్పించారు.ఏడుపాయల్లోభక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పాపన్నపేట ఎస్ఐ సారా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

# హాజీపూర్ లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పిల్లర్లకే పరిమితం పేదల కల కల్లేనా?



**అచ్చంపేట, అక్టోబర్ 16:(వుదయంప్రతినిధి)**

తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకం అచ్చంపేట మండలం హాజీపూర్ గ్రామంలో అటకెక్కింది. 8 ఏళ్ల క్రితం మొదలు పెట్టిన నిర్మాణం పిల్లర్ల దశలోనే ఆగిపోయి శిథిలావస్థకు చేరుకుంది. కళ్ళకు కట్టినట్లు నిర్లక్ష్యం:1.నిర్మాణం పరిస్థితి: కేవలం 1215 అడుగుల కాంక్రీట్ పిల్లర్లు మాత్రమే నిలబడి ఉన్నాయి. పిల్లర్ల పైన ఇనుప చువ్వలు (రాడ్లు) తుప్పు పట్టి ఆకాశం వైపు చూస్తున్నాయి. కొన్ని చోట్ల బీమ్ లు, స్లాబ్ లు పోసినా, నల్లటి వర్షపు మరకలతో, పగుళ్లతో దర్శనమిస్తున్నాయి.2. గోడలు:కొన్ని ఇళ్లకు ఇటుకలతో గోడలు లేపారు కానీ ప్లాస్టరింగ్ లేదు. సిమెంట్ పూత లేక ఇటుకలు బయటకు కనిపిస్తున్నాయి.3. పరిసరాలు: నిర్మాణ స్థలం చుట్టూ పిచ్చిమొక్కలు, జాలి చెట్లు, తుంగ గడ్డి మొలిచి అడవిలా మారింది. కింద ఎర్రరాతి నేల, చిన్న చిన్న రాళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు పడి ఉన్నాయి. ఎలాంటి రోడ్డు, డ్రైనేజీ, కాంపౌండ్ వాల్ లేదు.4. నాణ్యత ప్రశ్నార్థకం: ఏళ్లుగా గాలికి, వానకు తుప్పు పట్టిన పిల్లర్లు ఇప్పుడు ఇల్లు కట్టడానికి పనికొస్తాయా అనే అనుమానం వ్యక్తమవుతోంది. 201718 లో: అప్పటి BRS ప్రభుత్వం నాగర్ కర్నూల్ జిల్లాలో వేల ఇళ్లు మంజూరు చేసింది. అందులో భాగంగా అచ్చంపేట మండలం హాజీపూర్ లో సుమారు 100 ఇళ్లకు శంకుస్థాపన చేశారు. లబ్ధిదారులను ఎంపిక చేసి, గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో పనులు మొదలు పెట్టారు. కాంట్రాక్టర్ కొన్ని నెలలు పని చేసి, బిల్లులు రావడం లేదని, సిమెంట్, ఐరన్ ధరలు పెరిగాయని చెప్పి మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయాడు. అప్పటి నుండి అధికారులు కూడా పట్టించుకోలేదు.లబ్ధిదారుల ఆవేదన మాటల్లో:

మాకు 2018 లోనే ఇల్లు వచ్చిందని చెప్పారు. ఎంపిక పత్రం కూడా ఇచ్చారు. ఇప్పటికీ రోజూ వచ్చి ఈ పిల్లర్లను చూసి వెళ్తున్నాం. మేము ఇప్పటికీ నెలకు రూ. 3 వేలు అద్దె కడుతూ బతుకుతున్నాం. పిల్లర్లకే 8 ఏళ్లు పట్టింది, ఇల్లు ఎప్పుడు వస్తుందో తెలియదు" అని హాజీపూర్ కు చెందిన ఓ మహిళ కన్నీటి పర్యంతమైంది. అధికార నిర్లక్ష్యం ప్రమాదకరంగా నిర్మాణం:ఇప్పుడున్న పిల్లర్లను ఇలాగే ఉంచి పైన ఇల్లు కడితే అది ప్రమాదకరమని ఇంజనీర్లు చెబుతున్నారు. తుప్పు పట్టిన రాడ్ల సామర్థ్యం తగ్గిపోతుంది. తిరిగి కొత్తగా బలపరీక్షలు (స్ట్రెంగ్త్ టెస్ట్) చేసి, లేదా కూల్చి కొత్తగా కట్టాల్సి ఉంటుంది. దీనివల్ల ప్రభుత్వానికి రెట్టింపు ఖర్చు అవుతుంది.ప్రస్తుత ప్రభుత్వం ఏం చేయాలి? గ్రామస్తుల డిమాండ్:1. నాగర్ కర్నూల్ కలెక్టర్, హౌసింగ్ శాఖ EE, DE లు వెంటనే హాజీపూర్ సైట్ ను సందర్శించాలి.2. అసంపూర్తి ఇళ్లకు తిరిగి అంచనాలు వేసి, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిధులు మంజూరు చేయాలి.3. అర్హులైన పేదలందరికీ డ్రా పద్ధతిలో కాకుండా, గతంలో ఎంపికైన వారికే ఇళ్లు ఇవ్వాలి.4. నిర్మాణం పూర్తయ్యే వరకు లబ్ధిదారులకు అద్దె భత్యం ఇవ్వాలని కోరుతున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి అసంపూర్తి ఇళ్లు 20 వేలకు పైగా ఉన్నాయని, వాటిని పూర్తి చేసే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. మరి హాజీపూర్ పేదల కల ఎప్పుడు నెరవేరుతుందో వేచి చూడాలి

# దివ్యాంగుల పింఛను నిబంధనల సడలింపుపై హర్షం

**అచ్చంపేట, అక్టోబర్ 16 (వుదయం ప్రతినిధి)**

దివ్యాంగుల పింఛను నిబంధనలను సడలిస్తూ కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం పట్ల NPRDINDIA దివ్యాంగుల సంఘం ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఇంచార్జి రాజశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఉన్న 80 శాతం అంగవైకల్యం నిబంధనను 40 శాతానికి తగ్గించడంతో పాటు, కనీస వయోపరిమితిని ఎత్తివేసి పుట్టినప్పటి నుంచే దివ్యాంగులను పింఛను పరిధిలోకి తీసుకురావడం హర్షణీయమని ఆయన పేర్కొన్నారు. ఆలస్యంగానైనా కేంద్ర ప్రభుత్వం ఇలాంటి సానుకూల నిర్ణయం తీసుకోవడం చాలా మంచి పరిణామమని అన్నారు.ఈ నిర్ణయం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది దివ్యాంగులకు ప్రయోజనం చేకూరుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దివ్యాంగుల సంక్షేమానికి సంబంధించి లబ్ధిదారుల సంఖ్యను పెంచుతూ కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించిన ఈ నిర్ణయాలను ఆయన స్వాగతించారు.దివ్యాంగుల సమస్యలను పరిష్కరించడంతో పాటు, వారి సంక్షేమానికి మరిన్ని చర్యలు తీసుకోవాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేయాలని సూచించారు. దివ్యాంగుల పింఛను నిబంధనల్లో సడలింపులు తీసుకువచ్చినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వానికి NPRDINDIA తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామని రాజశేఖర్ పేర్కొన్నారు.

# ఎంపీడీఓ కార్యాలయం ముందు ఘనంగా బతుకమ్మ పండుగ

***బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎంపీడీఓ శ్రీనిజ**

**యాలాల అక్టోబర్ 16 వుదయం ప్రతినిధి:-**

యాలాల మండల పరిషత్ కార్యాలయం ముందు ఘనంగా ఘనంగా బతుకమ్మ పండుగ శుక్రవారం నిర్వహించారు ఈ కార్యక్రమంలో మహిళలు బతుకమ్మలను రంగ రంగ వైభవంగా ఏర్పాటు చేసి బతుకమ్మ పండుగ వేడుకను నిర్వహించుకున్నారు. ఈ పండుగ కార్యక్రమంలో యాలాల ఎంపీడీవో శ్రీనిజ, మండల ఐకెపి ఎపిఎం శ్రీనివాస్, ఐకెపి సిబ్బంది ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది వివిధ గ్రామాల మహిళలు సంబరాలు పాల్గొన్నారు. వివిధ గ్రామాల నుండి డ్వాక్రా మహిళలు బతుకమ్మలను ఏర్పాటు చేసి ఆటపాటలతో అలరింపజేశారు.

అనంతరం రంగురంగుల పూలతో బతుకమ్మలను తయారుచేసి ఎంత వైభవంగా బతుకమ్మ పండుగను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, సూపరిండెంట్ కృష్ణారావు, ఉపాధి హామీ సిబ్బంది వివిధ గ్రామాల మహిళలు పాల్గొన్నారు

# ఈశ్వరాలయంలో ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

*** సరస్వతి దేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు**
*** భక్తిశ్రద్ధలతో ఘనంగా కుంకుమార్చన.. పల్లకి సేవ**

**పాపన్నపేట, అక్టోబర్: 16 (వుదయం ప్రతినిధి)**



పాపన్నపేట మండలంలోని యూసుఫ్ పేట గ్రామంలో ఈశ్వరాలయ ప్రాంగణంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శ్రీ సరస్వతి దేవి రూపంలో భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు రమేష్ శర్మ మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భజన పాటలతో భక్తుల జయ జయ ధ్వానాల నడుమ అమ్మవారి పల్లకి సేవ కన్నుల పండువగా సాగింది. భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, చిన్నారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కృపాకటాక్షాలు పొందారు.

# బొమ్మనపల్లిలో విషాదం LT లైన్ తెగి పంచాయతీ మల్టీ వర్కర్ సౌట బాలయ్య దుర్మరణం

**అచ్చంపేట, అక్టోబర్ 16:(వుదయం ప్రతినిధి )**



అచ్చంపేట మండలం బొమ్మనపల్లి గ్రామంలో గురువారం మధ్యాహ్నం విషాదకర సంఘటన చోటు చేసుకుంది.గ్రామ పంచాయతీలో గత 8 సంవత్సరాలుగా మల్టీ పర్పస్ వర్కర్ గా పని చేస్తున్న సౌట బాలయ్య (45) విధి నిర్వహణలో ఉండగా కరెంట్ షాక్ తో శుక్రవారం దుర్మరణం చెందాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.
మధ్యాహ్నం బాలయ్య మసీదు దగ్గర గ్రామపంచాయతీ పనులు చేసుకుంటు న్నాడు. అదే సమయంలో మసీదు పక్కనే ఉన్న విద్యుత్ లైన్ పైన ఉన్న చెట్టు మీద కోతుల గుంపు ఒకదానితో ఒకటి కొట్లాడు కుంటూ గంతులు వేసింది.కోతులు చెట్టు నుండి ఎల్ టీ లైన్ పై పడటంతో వైరు ఒక్కసారిగా తెగినేరుగా బాలయ్య చేతి మీద పడింది.లైవ్ కరెంట్ ఉండటంతో తీవ్ర షాక్ కు గురై అక్కడికక్కడే కుప్ప కూలిపోయాడు. స్థానికులు వెంటనే అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.
మాజీ సర్పంచ్ బోడ్కా నాయక్ పరామర్శ:విషయం తెలుసుకున్న టీఆర్ఎస్ మండల నాయకులు, మాజీ సర్పంచ్ బోడ్కా నాయక్ ఆధ్వర్యంలో టీఆర్ఎస్ నాయకులు బాలయ్య నివాసానికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. భార్య, పిల్లలను ఓదార్చి ధైర్యం చెప్పారు.
ఈ సందర్భంగా బోడ్కా నాయక్ మాట్లాడుతూ బాలయ్య 8 ఏళ్లుగా గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా, వాటర్ మ్యాన్ గా నిజాయితీగా పని చేశాడు. విధి నిర్వహణలో ఉండగా అన్యాయంగా ప్రాణాలు కోల్పోయాడు. చెట్ల కొమ్మలు లైన్లకు తగులుతున్నాయని ఎన్నిసార్లు చెప్పినా విద్యుత్ శాఖ పట్టించుకోలేదు. ఇది పూర్తిగా అధికారుల నిర్లక్ష్యమేఅని ఆగ్రహం వ్యక్తం చేశారు.బోడ్కా నాయక్, టీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు 1. విధి నిర్వహణలో మృతి చెందిన గ్రామపంచాయతీ మల్టీ వర్కర్ సౌట బాలయ్య కుటుంబానికి రూ. 15 లక్షల ఎక్స్ గ్రేషియాతక్షణమే ప్రకటించాలి.2. మృతుని భార్యకు గ్రామపంచాయతీలో కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలి.3. పిల్లల చదువు బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి.4. బొమ్మనపల్లి గ్రామంలో ప్రమాదకరంగా వేలాడుతున్న లైన్లు, చెట్ల కొమ్మలను వెంటనే తొలగించి, కోతుల బెడద నివారించాలని డిమాండ్ చేశారు.ఈ ఘటనపై అచ్చంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్ట్ మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబానికి అప్పగించారు. మృతుని అంత్యక్రియలు గ్రామంలోనే నిర్వహించనున్నారు.ఈ పరామర్శలో మాజీ ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, టీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల ఆధ్వర్యంలో వంటా వార్పు 4వ రోజుకు చేరుకున్న రిలే దీక్షలు

**నారాయణపేట అక్టోబర్ 16(వుదయం ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్రంలోని జాతీయ ఆరోగ్య మిషన్ ఎన్.హెచ్.ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం టీజీ ఎన్.హెచ్.ఎం జేఏసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం నాటితో నారాయణపేట జిల్లాలో నాల్గవ రోజుకు చేరుకుంది. జిల్లా కేంద్రంలోని వివేకానంద పార్క్ వద్ద ఎన్.హెచ్.ఎం ఉద్యోగులు వంటా వార్పు చేసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.ఎన్.హెచ్.ఎం నిరసనలకు పలు సంఘాల మద్దతుఎన్.హెచ్.ఏం ఉద్యోగుల రిలే దీక్షలకు జిల్లా డిఎంఎచ్ఓ కార్యాలయము తరపున డాక్టర్ సాయిరాం, డాక్టర్ సత్య ప్రకాష్ రెడ్డి, జిల్లా ఆసుపత్రి ఉద్యోగ సంఘం తరపున డాక్టర్ బాలాజీ, సత్యనారాయణ, పిఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షులు జనార్ధన్ రెడ్డి, టిఎన్జీఓ ఛైర్మెన్ నర్సింహ రెడ్డి, ఉపాధ్యక్షులు ఉదయ్ భాను, విజయ కుమార్, యూటీఎఫ్ అధ్యక్షులు బాలాజీ, భీమయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు, కార్యదర్శి బలరాంలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఎన్.హెచ్.ఏం ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు, ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు. ఎన్నో ప్రభుత్వాలు మారుతున్నా ఎన్.హెచ్.ఏం ఉద్యోగుల జీవితాల్లో మాత్రం ఆశించిన మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఉద్యోగులు నేటికి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాల్లో అభద్రత మధ్య పనిచేయాల్సి వస్తోందన్నారు.
మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు తప్పని సరిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. నేడు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో కుటుంబాలను పోషించేందుకు అందుకు తగిన వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎన్.హెచ్.ఏం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు బిక్షపతి, అధ్యక్షులు ప్రసాద్, కోశాధికారి రాఘవేందర్, ఎన్.హెచ్.ఎం యూనియన్ సభ్యులు డాక్టర్ నరసింహ రావు సగరి, శ్రీలత, వెంటరమణ, అనురాధ, తిరుపతి, కిరీటి, , విరోజ, చందన,శ్వేతశ్రీ, పుష్ప, సరస్వతి, డీడీఎం స్నేహలత, డిఏఏం మమత తదితరులు పాల్గొన్నారు.



# పశుసంవర్ధక శాఖలో వైభవంగా బతుకమ్మ వేడుకలు



**నాగర్ కర్నూల్ రూరల్, అక్టోబర్ 16 (వుదయం ప్రతినిధి):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ వేడుకలు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం వైభవంగా జరిగాయి. జిల్లా పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ కార్యాలయం ఆధ్వర్యంలో కార్యాలయ ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.శాఖకు చెందిన మహిళా ఉద్యోగులు సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. తీరొక్క రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. బతుకమ్మల చుట్టూ చేరి 'తోడు బతుకమ్మ తొందరగా రావమ్మా..' అంటూ పాటలు పాడుతూ ఆడిపాడారు.ఈ కార్యక్రమంలో డీవీఏహెచ్‌వో డాక్టర్ బి. జ్ఞాన శేఖర్, ఏడీ డాక్టర్ ఎస్.ఏ.ఎల్. నరసింహ, పశువైద్యులు డాక్టర్ కల్పన, డాక్టర్ రాజేష్ కుమార్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ జీవిత, డాక్టర్ నవ్యశ్రీ, డాక్టర్ పల్లవి, డాక్టర్ ప్రణీత, పశువైద్య సహాయకులు శ్రావణి, సల్మా, వనజ, లలిత, శైలజ, విజయలక్ష్మి, జ్యోతి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో కీలక మార్పులు

**అచ్చంపేట, అక్టోబర్ 16: (వుదయం ప్రతినిధి)**

జనన, మరణ ధ్రువపత్రాల జారీ నిబంధనలను తెలంగాణ ప్రభుత్వం కఠినతరం చేసిందని అచ్చంపేట తాసిల్దార్ జి సైదులు తెలియజేశారు. అక్టోబర్ నెల నుండి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, గడువు లోపు నమోదు చేసుకోకపోతే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రజా సమాచారం అత్యవసర హెచ్చరిక" పేరుతో ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది.
ఇకపై ఆలస్యం చేస్తే సామాన్య ప్రక్రియలో సర్టిఫికేట్ రాదని, ఉన్నతాధికారుల అనుమతి, చివరకు కోర్టు ఉత్తర్వులు కూడా తప్పనిసరి అవుతాయని స్పష్టం చేసింది.గడువు ముఖ్యం ఆలస్యం చేస్తే ఇబ్బందులు తప్పవు!ప్రభుత్వం నిర్ణయించిన నూతన గడువు విధానం ఇలా ఉంది:1. 0 నుండి 21 రోజుల లోపు (ఉత్తమ మార్గం):బిడ్డ పుట్టిన లేదా మరణం సంభవించిన 21 రోజుల లోపు సంబంధిత గ్రామ పంచాయతీ / మున్సిపాలిటీ / కార్పొరేషన్ కార్యాలయంలో నమోదు చేస్తే ఎలాంటి రుసుము లేకుండా, అత్యంత సులభంగా, ఉచితంగా జనన, మరణ ధ్రువపత్రం లభిస్తుంది.ప్రభుత్వం చెబుతున్న అత్యధిక సమయం ఇదే.2. 21 రోజుల నుండి 1 సంవత్సరం లోపు:21 రోజులు దాటితే ఆలస్య రుసుము (Late Fee) చెల్లించాల్సి ఉంటుంది. ఈ సమయంలో ఆన్ లైన్ ద్వారా లేదా మీ సేవ కేంద్రం ద్వారా లేట్ నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.3. 1 సంవత్సరం నుండి 2 సంవత్సరాల లోపు:ఏడాది దాటితే ప్రక్రియ మరింత కఠినం అవుతుంది. ఈ దశలో RDO / సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్ (SDM) గారి ముందస్తు లిఖితపూర్వక అనుమతి తప్పనిసరి.4. 2 సంవత్సరాలు దాటితే... (అత్యంత కఠినం):రెండేళ్లు దాటిన తర్వాత నమోదు చేయాలంటే సాధారణ అధికారుల పరిధిలో ఉండదు. నేరుగా ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు నుండి ప్రత్యేక ఉత్తర్వులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఇది సమయంతో కూడుకున్న, ఖర్చుతో కూడుకున్న ప్రక్రియ.ఈ సర్టిఫికేట్లు ఎందుకు అంత ముఖ్యం జనన ప్రమాణ పత్రం ఆధార్ నమోదు చేయడానికి, స్కూల్ అడ్మిషన్లు పొందడానికి, పాస్ పోర్ట్ తీయడానికి, భవిష్యత్తులో ప్రతి అధికారిక గుర్తింపునకు ఇది మూల ఆధారం.మరణ ప్రమాణ పత్రం : ఆస్తి పంపకాలు, వారసత్వ హక్కులు పొందడానికి, బ్యాంక్ ఖాతాల క్లెయిమ్ లు, జీవిత బీమా, కుటుంబ పెన్షన్, ప్రభుత్వ పథకాల లబ్ధి పొందడానికి తప్పనిసరిగా అవసరం.ప్రజలకు ప్రభుత్వం సూచన:అత్యధిక సమయం 21 రోజుల్లోనే నమోదు చేసుకోండి! సకాలంలో నమోదు..కార్యాలయాల చుట్టూ తిరిగే బాధ నుండి విముక్తి కావున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి, తమ పరిధిలో జనన, మరణాలు సంభవించిన వెంటనే 21 రోజుల లోపు తమ సమీప గ్రామ పంచాయతీ / పురపాలక సంఘం / మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సంప్రదించి నమోదు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు



# బెక్కెం గ్రామం లో బిపిఎల్ సీజన్–8 క్రికెట్ టోర్నమెంట్

**బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు ధారసింగ్**
**జిల్లా జనరల్ సెక్రెటరీ జగ్గారి శ్రీధర్ రెడ్డి మండల అధ్యక్షుడు బొగ్గు కుర్మయ్య**

**చిన్నంబావి మండలం 16 వుదయం రిపోర్టర్**

క్రీడల అభివృద్ధికి చేయూత.. యువతకు ప్రోత్సాహం.. క్రీడాకారుల విజయానికి సహకారం బెక్కెం బిపిఎల్ సీజన్-8 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటున్న బిజెపి పార్టీ సీనియర్ నాయకులు రాష్ట్ర నాయకులు ధారాసింగ్, జిల్లా జనరల్ సెక్రటరీ జగ్గారి శ్రీధర్ రెడ్డి మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య, నాయకులు గోపి నాయుడు, మేకల చెన్నయ్య, గణేష్ రెడ్డి క్రీడా కారులను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో అందించిన సహకారం జట్టు సభ్యుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. యువ క్రీడాకారులకు ప్రోత్సాహం.. క్రీడా రంగానికి చేయూత! నేటి యువత క్రీడల్లో రాణిస్తూ తమ ప్రతిభను చాటుకోవాలని, క్రీడల ద్వారా ఐకమత్యం, క్రమశిక్షణ, పట్టుదల వంటి విలువలను అలవర్చుకోవాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు. క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని అందించి యువత లో నూతన ఉత్తేజ నింపాలని. క్రీడాకారులు తమ ప్రతిభను వెలికి తీసేందుకు అవసరమైన సహకారం అందించడం అభినందనీయమని, ఇలాంటి ప్రోత్సాహం యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని క్రీడాభిమానులు పేర్కొంటున్నారు. క్రీడా కారుల్లో నూతనోత్సాహం బిపిఎల్ సీజన్-8 క్రికెట్ టోర్నమెంట్‌లో బెక్కెం గ్రామంలోని వాడే ఏడు టీములు మెరుగైన ప్రదర్శన కనబరిచి విజయాలు సాధించాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. ది క్రీడలకు ప్రోత్సహిస్తున్న బిజెపి నాయకులను రాష్ట్ర నాయకులు ధారాసింగ్ ను క్రీడాకారులు మరియు గ్రామ ప్రజలు పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు. క్రీడల అభివృద్ధికి, యువత ప్రోత్సాహానికి ఇలాంటి సహకారాలు ఎంతో దోహదపడతాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు ధారాసింగ్, జిల్లా జనరల్ సెక్రెటరీ జగ్గారి శ్రీధర్ రెడ్డి, మండల అధ్యక్షులు బొగ్గు కురుమయ్య, మేకల చెన్నయ్య, గోపి నాయుడు, గణేష్‌రెడ్డి, బిజెపి పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వీరేష్ మృతిపై రణరంగం!

**ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట మృతదేహంతో టీఆర్ఎస్ ధర్నా**
**పోలీసుల వేధింపులే కారణమంటూ ఆరోపణలు..**
**బాధ్యులపై చర్యలకు డిమాండ్**

**ధరూర్ అక్టోబర్ 16 (వుదయం బ్యూరో)**



బూరెడ్డిపల్లికి చెందిన వీరేష్ మృతి గద్వాలలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వీరేష్.. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. దీంతో వీరేష్ మృతదేహంతో గద్వాల ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మృతికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. టీఆర్ఎస్ నాయకుడు గొంగళ్ల రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. రాజకీయ కక్షతోనే వీరేష్‌పై కేసు నమోదు చేయించారని, పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు కొట్టారంటూ ఆరోపించారు. పోలీసుల వేధింపులు, అవమానంతో మనస్తాపానికి గురైన వీరేష్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చివరకు ప్రాణాలు కోల్పోయాడని పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో వీరేష్ పోటీ చేయడాన్ని జీర్ణించుకోలేని స్థానిక అధికార పార్టీ నాయకులు రాజకీయ కక్షతో అతడిని వేధించారని రంజిత్ కుమార్ ఆరోపించారు. పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని హితవు పలికారు. మృతిపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ధర్నా నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఆసుపత్రి వద్ద పోలీసులు భారీగా మోహరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకుడు ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకుడు కుర్వ పల్లయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ఎంబీబీఎస్ సీటు సాధించిన అనూషను అభినందించిన ఎస్పీ



**దామరగిద్ద అక్టోబర్ 16(వుదయం ప్రతినిధి)**

దామరగిద్ద గ్రామం, మండలానికి చెందిన ఎం. అనూష ఎంబీబీఎస్ వైద్య విద్యలో సీటు సాధించి, వికారాబాద్‌లోని వైద్య కళాశాలలో ప్రవేశం పొందిన సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ ఐపీఎస్‌ను ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ అనూషను అభినందించి, స్వీట్స్ తినిపించి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కష్టపడి చదివి ఎంబీబీఎస్ సీటు సాధించడం అభినందనీయమని, అనూష తన తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాలలో చేరిన తర్వాత క్రమశిక్షణతో చదువుతూ, మంచి ప్రతిభ కనబరిచి మెరిట్ సాధించాలని సూచించారు. భవిష్యత్తులో పీజీ వైద్య విద్యలో కూడా మంచి ర్యాంకు సాధించి, మరోసారి మెరిట్ ద్వారా సీటు పొందేలా కృషి చేయాలని ప్రోత్సహించారు.విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటిని సాధించేందుకు నిరంతరం శ్రమించాలని ఎస్పీ సూచించారు. విద్య ద్వారానే జీవితాల్లో మార్పు వస్తుందని, మంచి విద్యను అభ్యసించడం ద్వారా ఉన్నత ఉద్యోగాలు సాధించి తమ కుటుంబాల ఆశయాలను నెరవేర్చడంతో పాటు సమాజానికి సేవ చేసే అవకాశాన్ని పొందవచ్చని తెలిపారు.
చదువుకు సంబంధించి అనూషకు ఎలాంటి సహకారం అవసరమైనా తనను సంప్రదించవచ్చని, తగిన సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని ఎస్పీ హామీ ఇచ్చారు. విద్యార్థులు తమ అవకాశాలను సద్వినియోగం చేసుకొని, కష్టపడి చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా ఎస్పీ ఆకాంక్షించారు. అనూష బ్రదర్ కానిస్టేబుల్ అరుణ్ కూడా ఉన్నారు.

# వైభవంగా కోటగడ్డ దుర్గామాత హోమం



**నిజాంపేట, అక్టోబర్ 16 వుదయం ప్రతినిధి**

ప్రదీప్ రెడ్డిమండల పరిధిలోని చల్మెడ గ్రామంలో కోటగడ్డ దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 9వ వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ దుర్గామాత మండపం వద్ద హోమ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్రీ వెంకట రామ్మోహన్ శర్మ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి హోమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో కోటగడ్డ దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నా

# ఘనంగా అమ్మ పాదపూజ బతుకమ్మ సంబరాలు



**వెల్దండ అక్టోబర్ 16 (వు దయం )**

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఐక్యత ఫౌండేషన్, వందేమాతరం ఫౌండేషన్, మై విలేజ్ మోడల్ విలేజ్, శృతిలయ కల్చరల్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా సాంస్కృతిక శిక్షణ శిబిరం విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీస్తూ, నైతిక విలువలను పెంపొందించే వేదికగా నిలిచింది. శిబిరం ముగింపునకు ముందు రోజు బతుకమ్మ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారుఈ శిబిరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు లాంగ్వేజ్, లాజిక్, లైఫ్ స్కిల్స్, నైతిక విలువలు, యోగా, బతుకమ్మ పాటలు, కోలాటాలు, శాస్త్రీయ నృత్యాల్లో ప్రత్యేక శిక్షణ అందించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సృజనాత్మకత, సంస్కృతి సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందించడమే లక్ష్యంగా కార్యక్రమాలను నిర్వహించారు.
ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. తల్లిని మించిన దైవం లేదని, జన్మనిచ్చి, ప్రేమతో పెంచి, జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరుకునే తల్లి సేవలను ఎప్పటికీ మరువకూడదని పేర్కొన్నారు. తల్లిదండ్రులను గౌరవించడం, పెద్దలను ఆదరించడం, నైతిక విలువలను పాటించడం ప్రతి విద్యార్థి జీవితంలో భాగం కావాలని సూచించారు. విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు, మానవీయ విలువలను అలవర్చుకున్నప్పుడే సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగగలరని తెలిపారు.బతుకమ్మ వేడుకలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఐకమత్యాన్ని, కళల పట్ల ఆసక్తిని పెంపొందిస్తాయని అన్నారు. అమ్మ పాదపూజ ద్వారా మాతృప్రేమ గొప్పతనాన్ని, తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞతా భావాన్ని విద్యార్థులకు తెలియజేయడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వెల్దండ సర్పంచ్ మట్టి యాదమ్మ వెంకటయ్య గౌడ్, ఐక□

# దుర్గామాతకు ప్రత్యేక పూజలు



**రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి**

**వెల్దండ అక్టోబర్ 16 (వు దయం)**

మండల పరిధిలోని చేర్కూర్ గ్రామంలో నిర్వహిస్తున్న దుర్గా భవాని నవరాత్రి ఉత్సవాలలో. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వెల్దండ మండల BRS పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీపీ పుట్టరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, జిల్లా నాయకులు నాగులు నాయక్, సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు, ఉప సర్పంచ్ కొండలు, మాజీ ఎంపీటీసీలు రాములు, లింగం, మాజీ సర్పంచ్ అంజి నాయక్, మాజీ ఉప సర్పంచులు నిరంజన్, నర్సింహా, శ్రీరాములు, వార్డు సభ్యులు సునీత, ఆనంద్, అశోక్, లాలయ్య, జంగయ్య, మాజీ వార్డు సభ్యులు మీసాల రాజు, సందీప్, శ్రీనివాస్ రెడ్డి,నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, సుభాష్, పోలె అశోక్, ప్రభాకర్, అంజి మాస్టర్, జహంగీర్, జంగయ్య, నర్సింహా, సతీష్, అనంతరములు, శ్రీను, బుచ్చిబాబు, రవి, కృష్ణ, శ్యాం, మణి, భరత్, శశిధర్, రామచంద్రయ్య, గాండ్ల జంగయ్య, రామరాజు, పరశురాములు, శ్రీకాంత్ రెడ్డి, వంగూర్ లక్ష్మయ్య, వంశీ, శివశంకర్, అభి, శివ, గణేష్, సోను, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, యువకులు, హనుమాన్ యూత్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

# గత పదేళ్ల పాపాలు కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్‌పై ఆరోపణలా!

**54 షట్టర్లు కూల్చిన చరిత్ర మీది..**
**వ్యాపారుల కోసం ఏనాడైనా పోరాడారా?**
**బీఆర్ఎస్ నేతలపై కౌన్సిలర్ షేక్షావలి ఆచారి నిప్పులు**

**అయిజ అక్టోబర్ 16 (వుదయం ప్రతినిధి )**



గత పదేళ్ల పాలనలో ఏం చేశారో చెప్పుకోలేని బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు కాంగ్రెస్‌పై ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని అయిజ కౌన్సిలర్ మాస్టర్ షేక్షావలి ఆచారి తీవ్రస్థాయిలో మండి పడ్డారు. అయిజ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేతల తీరుపై ఘాటు విమర్శలు చేశారు. 54 షట్టర్ల కూల్చివేతకు సమాధానం చెప్పండి!గత పదేళ్లు అధికారంలో ఉండి 54 షట్టర్లను కూల్చివేసిన చరిత్ర మీది కాదా? అని బీఆర్ఎస్ నాయకులను నిలదీశారు. గతంలో జరిగిన పరిణామాలకు సమాధానం చెప్పకుండా ఇప్పుడు కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజలకు వాస్తవాలు తెలియవని భావిస్తే అది మీ పొరపాటేనని వ్యాఖ్యానించారు. వ్యాపారులపై ప్రేమ ఇప్పుడే పుట్టుకొచ్చిందా? జాతర పేరుతో వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేసినప్పుడు వారి కష్టాలు గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. వ్యాపారుల సంక్షేమం గురించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు గతంలో వారి సమస్యలపై ఎప్పుడైనా పోరాడారా? రోడ్డెక్కి ధర్నా చేశారా? అని సవాల్ విసిరారు. అవసరమైనప్పుడు మౌనంగా ఉండి, ఇప్పుడు రాజకీయ ఆరోపణలకు దిగడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.ప్రజలు కష్టాల్లో ఉంటే నేతలను షేక్షావలి ఆచారి ప్రశ్నించారు. ప్రజలు, రైతులు, వ్యాపారులు ఎదుర్కొన్న సమస్యలపై గతంలో మీరేం చేశారో ముందుగా చెప్పాలని డిమాండ్ చేశారు.గత పాలనలోని అంశాలకు సమాధానం చెప్పకుండా కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా ప్రజల దృష్టిని మళ్లించలేరని అన్నారు. గత పదేళ్ల పాలనపై ప్రజలకు లెక్కలు చెప్పండి.. ఆ తర్వాతే కాంగ్రెస్‌ను ప్రశ్నించండి అంటూ బీఆర్ఎస్ నాయకులకు ఘాటుగా బదులిచ్చారు.

# పాలెం వెంకన్నాలయంలో దుర్గామాత పూజలు

**బిజినపల్లి అక్టోబర్ 16 (వుదయం ప్రతినిధి)**

మండల పరిధిలోని పాలెం గ్రామంలో గల శ్రీ అలర్మెల్ మంగ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం అమ్మవారిని శ్రీ సరస్వతి మాతగా సర్వాంగ సుందరంగా అలంకరించారు.
ఈ సందర్భంగా పూజారి జయంత్ ఆధ్వర్యంలో రేణుగౌడ్, చంద్రావతి, వెంకటేశ్వర్లు, లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం నిత్యపూజలు, పిల్లలచే కుంకుమార్చన, పిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మహిళలచే సామూహిక కుంకుమార్చన , బతుకమ్మ వేడుకలు కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు



# పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**ప్రభుత్వ విప్ శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్ నగర్ అక్టోబర్ 16(వుదయం ప్రతినిధి)**

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని క్రిస్టియన్‌పల్లి, ఆదర్శ్‌నగర్ ప్రాంతాలకు చెందిన 310 మంది డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు , అన్నపూర్ణ గార్డెన్స్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలకు చట్టబద్ధమైన హక్కులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. 523 సర్వే నంబర్ పరిధిలో అనేక చిక్కుముడులు ఉన్నప్పటికీ, వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరించి 310 కుటుంబాలకు ఇళ్లపై చట్టబద్ధమైన హక్కులు కల్పించడం తనకు సంతోషంగా ఉందని అన్నారు. గతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు అందించినప్పటికీ, సరైన గుర్తింపు పత్రాలు, చట్టబద్ధమైన ధ్రువపత్రాలు లేకపోవడంతో అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయని తెలిపారు. ఇళ్లను వారసులకు బదిలీ చేసే విషయంలోనూ సమస్యలు తలెత్తాయని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు చిక్కుముడులు రాకుండా అన్ని అంశాలను పరిశీలించి, చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేసిన తర్వాతే పట్టాలు పంపిణీ చేస్తున్నామని ఆయన వివరించారు. ఈ పట్టాలు కేవలం కాగితాలు కావని, కుటుంబాలకు భద్రత కల్పించే చట్టబద్ధమైన హక్కులని అన్నారు. రాబోయే తరాలు కూడా తమ ఇంటిపై గర్వంగా హక్కు ప్రకటించుకునేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజాప్రతినిధులకు ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రోత్సాహం అందిస్తోందని పేర్కొన్నారు. ప్రజలను కేవలం ఓటు బ్యాంకుగా చూసే నాయకత్వానికి, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు పనిచేసే నాయకత్వానికి ఎంతో తేడా ఉంటుందని, .మహబూబ్‌నగర్ నగరంలో గతంలో జరిగిన అక్రమాలు, ఆక్రమణలు, బెదిరింపులు, అక్రమ కేసులకు సంబంధించిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ, చట్టబద్ధమైన శాశ్వత పరిష్కారాలు చూపడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.పేదరికానికి కులం, మతం ఉండవని, అన్ని వర్గాల పేదలకు సమానంగా న్యాయం చేయడమే నిజమైన ప్రజాసేవ అని ఆయన స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ నగరాన్ని ఒక కుటుంబంగా భావించి, ప్రజలందరి అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. 523 సర్వే నంబర్ పరిధిలోని కాలనీని మహబూబ్‌నగర్‌లోనే ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే వెల్లడించారు. ఇళ్ల పట్టాల పంపిణీతోనే తమ బాధ్యత పూర్తికాదని, కాలనీలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం కూడా ప్రభుత్వ బాధ్యతేనని అన్నారు. కాలనీ అభివృద్ధి కోసం త్వరలో రూ.2 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు ప్రకటించారు. కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల వంటి సదుపాయాలు అందుబాటులో లేని పక్షంలో వాటిని కల్పించేందుకు తక్షణమే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్‌తో చర్చిస్తున్నట్లు వెల్లడించారు. నగర ప్రజలు మురుగునీటి సమస్యలతో అనారోగ్యానికి గురికాకుండా రూ.603 కోట్లతో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థను తీసుకొచ్చామని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అమలైతే నగరంలో పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో మహబూబ్‌నగర్‌ను సుందరమైన, ఆదర్శవంతమైన నగరంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధన వెనుక విద్య, ఉపాధి, సాగునీరు ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయని గుర్తు చేసిన ఆయన , పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించి, వారు ఉన్నత



స్థానాలకు చేరుకునేలా అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల పిల్లల భవిష్యత్తును మెరుగుపరిచేందుకు అవసరమైన నిధులు ఖర్చు చేయడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఆర్అండ్‌బీ అతిథిగృహం సమీపంలో ప్రతిపాదించిన కూరగాయలు, మాంసాహార మార్కెట్‌ను మరో అనువైన ప్రాంతానికి తరలించి, ఆ స్థలంలో పూలే-అంబేద్కర్ విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. వేలాది మంది విద్యార్థులకు ఉపయోగపడేలా రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచే గ్రంథాలయాన్ని నిర్మించాలన్నది తమ లక్ష్యమని తెలిపారు. ఆ మహబూబ్‌నగర్ డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ.70 కోట్లు మంజూరు చేయించామని, మొదటి దశలో రూ.20 కోట్లతో పనులు ప్రారంభించామని చెప్పారు. ఎంవీఎస్ జూనియర్ కళాశాల పాత భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మిస్తున్నామని, సుమారు 2,000 మంది విద్యార్థులు నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకునేలా ఆ విద్యాసంస్థను తెలంగాణ పబ్లిక్ స్కూల్ తరహాలో అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. గర్ల్స్ జూనియర్ కళాశాల కొత్త భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. నడిగడ్డలోని ఒకేషనల్ కళాశాల అభివృద్ధికి రూ.3 కోట్లు కేటాయించి ఆధునిక సదుపాయాలు కల్పించామని, పక్కనే ఉన్న జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి మరో రూ.2 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఐటీఐల్లో ఆధునిక సాంకేతిక విద్య అందించేందుకు రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న 10 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో రెండింటిని మహబూబ్‌నగర్‌కు తీసుకొచ్చామని సుమారు రూ.68 కోట్లతో ఆధునిక యంత్రాలు, సాంకేతిక పరికరాలను ఏర్పాటు చేసి, టాటా గ్రూప్ సహకారంతో విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో సుమారు 95 శాతం మందికి ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను సాధించేందుకు విద్య, జ్ఞానం అత్యంత ముఖ్యమని ఎమ్మెల్యే అన్నారు. ఒక కుటుంబం విద్య ద్వారా అభివృద్ధి చెందితే, దానిని చూసి మరో వెయ్యి కుటుంబాలు స్ఫూర్తి పొందుతాయని పేర్కొన్నారు. పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా, పారిశ్రామికవేత్తలుగా, ఇతర ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు తమ పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, భవిష్యత్తు తరాలు మెరుగైన జీవితాన్ని గడిపేలా ప్రోత్సహించాలని కోరారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం, కష్టాల్లో అండగా నిలవడం, పిల్లలకు నాణ్యమైన విద్యను అందించి ఉపాధి అవకాశాలు కల్పించడమే నిజమైన రాజకీయమని అన్నారు. వచ్చే ఎన్నికల గురించి మాత్రమే కాకుండా, వచ్చే తరాల భవిష్యత్తు కోసం పనిచేసే నాయకులే చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ నగర అభివృద్ధికి, పేద ప్రజల సంక్షేమానికి, విద్యార్థుల భవిష్యత్తుకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ ....క్రిస్టియన్‌పల్లిలో గత తొమ్మిది, పది సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమస్యను పరిష్కరించి, అర్హులైన లబ్ధిదారులకు పట్టాలు అందించడం సంతోషంగా ఉందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పాటు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించిన పెండింగ్ సమస్యలను పరిష్కరించి అర్హులకు న్యాయం చేయాలని నిర్ణయించిందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక చొరవతో జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఇందులో భాగంగా క్రిస్టియన్‌పల్లిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించి, లబ్ధిదారులకు వారి ఇళ్లపై హక్కులు కల్పించగలిగామని పేర్కొన్నారు. లబ్ధిదారులకు అందజేసిన పట్టాలు వారి హక్కులకు నిదర్శనమని, ఇళ్లకు సంబంధించిన సమస్యలు పరిష్కారమై హక్కులు లభించడం ఆనందదాయకమని అన్నారు. లబ్ధిదారుల ముఖాల్లో కనిపిస్తున్న సంతోషం జిల్లా యంత్రాంగానికి సంతృప్తినిస్తోందని తెలిపారు. కుటుంబ సభ్యులందరూ ఈ ఆనందంతో బతుకమ్మ, దసరా పండుగలను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. క్రిస్టియన్‌పల్లిలో ఇంకా ఏవైనా అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంటే జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. పట్టాల పంపిణీ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ జి. మమత, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా ఛైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, 10వ డివిజన్ కార్పొరేటర్ రమేష్, తో పాటు ఇతర కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దుర్గా అమ్మవారి దయతో రోగులకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరాలి

**ప్రభుత్వ సాధారణ ఆస్పత్రిలో వైభవంగా బతుకమ్మ సంబరాలు శాస్త్రోక్తంగా ఆయుధ పూజలు, దుర్గా దేవి పూజలు**

**నాగర్ కర్నూల్ అక్టోబర్ 16 (వుదయం ప్రతినిధి)**



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో శుక్రవారం నాడు ఘనంగా బతుకమ్మ సంబరాలు ,వివిధ ఆపరేషన్ థియేటర్లలో ఆయుధ పూజలు నిర్వహించినట్లు సూపరిడెంట్ డాక్టర్ పి. సుప్రియ తెలిపారు. గైనకాలజీ, సర్జికల్, ఆర్థోపెడిక్ ప్రత్యేక ఆపరేషన్ థియేటర్లలో వేద మంత్రోచ్చరణల మధ్య దుర్గ అమ్మవారికి ఆయుధ పూజలు నిర్వహించారు. నాగర్ కర్నూల్ ప్రభుత్వ సాధారణ ఆస్పత్రికి వచ్చే ప్రతి రోగి కూడా సంపూర్ణంగా ఆరోగ్యం స్వస్థత చేకూరి తిరిగి వెళ్లాలని దుర్గా అమ్మవారిని వైద్యులు, నర్సింగ్ అధికారులు, ఇతర సిబ్బంది ప్రత్యేకంగా పూజలు చేసి అమ్మవారిని కోరారు. దుర్గ అమ్మ దయ ఉంటే అన్ని ఉన్నట్లే అని అన్నారు. గైనకాలజీ విభాగంలో ప్రత్యేకంగా ఆస్పత్రికి వచ్చే ప్రతి గర్భిణికి సుఖ ప్రసవం చేసుకొని,తల్లి బిడ్డలు సుఖంగా ఇంటికి చేరాలని అమ్మవారిని పూజించారు. మాతా శిశు సంరక్షణ ఆరోగ్య సేవలు మెరుగ్గా చూసే విధంగా వైద్యులకు సిబ్బందికి అమ్మ కృపాకటాక్షాలు కలగాలని వేద పండితులు కందాడై శ్రీనివాసచార్యులు వేద ఆశీర్వాదం ఇచ్చారు. ఆస్పత్రిలోని నర్సింగ్ అధికారులు,వైద్యులు, సానిటరీ సిబ్బంది, ల్యాబ్ సిబ్బంది సంయుక్తంగా బతుకమ్మ సంబరాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా తయారు చేసిన బతుకమ్మలను పూజించి ఆటపాటలతో బతుకమ్మ వారినీ ఘనంగా పూజించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ రవిశంకర్, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ సౌమ్య, సర్జికల్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.రఘు,అనస్థీయ నిపుణులు డాక్టర్ ధీరజ్ కుమార్,ఈ.ఎన్.టి, విభాగాధిపతి డాక్టర్ వాణి, నర్సింగ్ సూపరిడెంట్ ఆర్.సంగీత,కే. మంజుల రాణి, ఇతర నర్సింగ్ అధికారులు కవిత,పుష్ప,రాధా, పద్మ,సునీత, ఆనంద్, హెల్ప్ డెస్క్ ఇంచార్జ్ యాదగిరి,ఇతర అన్ని విభాగాల వైద్యులు, నర్సింగ్ అధికారులు, కార్యాలయ సిబ్బంది,సానిటరీ సిబ్బంది,సెక్యూరిటీ సిబ్బంది,ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తోర్నాల్ గ్రామ పంచాయతీలో

**- సర్పంచ్ సంగమేశ్వర్ పాటిల్ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**

**వుదయం మనూర్, అక్టోబర్ 16**



నారాయణఖేడ్ నియోజకవర్గం సంగారెడ్డి జిల్లా మనూర్ మండలం తోర్నాల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పాలన:ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తోంది. ఇందులో భాగంగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, ఆరు గ్యారెంటీల అమలు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రుణమాఫీ వంటి ఎన్నో సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తోంది.అందులో భాగంగానే పాత రేషన్ కార్డుల స్థానంలో క్యూఆర్ కోడ్, అత్యాధునిక సెక్యూరిటీ ఫీచర్లతో కూడిన స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డులను ప్రవేశపెట్టింది. ఈ కార్డుల వల్ల నకిలీ కార్డులకు చెక్ పడి, అర్హులైన పేదలందరికీ పారదర్శకంగా సన్న బియ్యంతో పాటు రేషన్ సరుకులు అందుతాయి.జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షేట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి ఆదేశాల మేరకు తోర్నాల్ గ్రామ పంచాయతీలో సర్పంచ్ సంగమేశ్వర్ పాటిల్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఈ స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ సంగమేశ్వర్ పాటిల్ మాట్లాడుతూ, సీఎం రేవంత్ భుత్వం పేదల పక్షపాతిగా పని చేస్తోందని, తోర్నాల్ గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు, స్మార్ట్ రేషన్ కార్డులు అందేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంబోజి, జీపీవో ఏవన్,పంచాయతీ కార్యదర్శి సంగీత మేడం, మాజీ సర్పంచ్ సంగారెడ్డి, మైనార్టీ అధ్యక్షుడు కాలేద్, సంగయ్య స్వామి, విట్టల్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో రెండు లక్షల రూపాయల ఇన్సూరెన్స్ చెక్కు అందజేత



**జన్నారం, అక్టోబర్ 16 (వుదయం విలేఖరి):**

జన్నారం మండల కేంద్రంలోని కోఆపరేటివ్ సహకార బ్యాంకు (పాక్స్ పొనకల్) ఆధ్వర్యంలో మృతుని భార్యకు రెండు లక్షల రూపాయల ఇన్సూరెన్స్ చెక్కును అందజేశారు.జన్నారం పట్టణానికి చెందిన శనిగారపు మహేష్ గత నెలలో అనారోగ్యంతో మరణించారు. మహేష్ సహకార బ్యాంకులో పంట రుణం తీసుకున్నప్పుడు ఇన్సూరెన్స్ చేయించుకున్నారు. మహేష్ ఇటీవల మరణించడంతో ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా వచ్చిన రెండు లక్షల రూపాయల చెక్కును పాక్స్ ఛైర్మన్ అల్లం రవి, బ్యాంకు మేనేజర్ అశ్విన్ శుక్రవారం రోజున మహేష్ భార్య నిరోషకు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పంట రుణం తీసుకునే సమయంలో ఇన్సూరెన్స్ చేయించుకోవడం వల్ల ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ అనిల్, సెక్రెటరీ రాజన్న, శ్రీనివాస్ బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు

# తెలంగాణ సాంస్కృతికీ ప్రతిబింబం బతుకమ్మ పండుగ.

**ప్రకృతిని ఆటపాటలతో ఆరాధించే అరుదైన 'దైవం బతుకమ్మ. రాజగోపాలపేట గ్రామంలో ఏడు రోజుల సద్దుల బతుకమ్మ.**

**నంగునూరు : అక్టోబర్16 వుదయం**

ఫోటో బతుకమ్మ ఎత్తుకున్న చిన్నారులు

తెలంగాణ ప్రజలు ఎంతో భక్తి శ్రద్ధలతో ప్రతిష్టాత్మకంగా జరుపుకునే సద్దుల బతుకమ్మ పండుగ రాజగోపాల్ పేట గ్రామంలో ఏడు రోజులకు జరుపుకోవడం ఇక్కడి ప్రాంత ప్రాముఖ్యత లో ఒకటి.శుక్రవారం నంగునూరు మండలంలోని రాజగోపాలపేట గ్రామంలో నేడు ఏడు రోజుల సద్దుల బతుకమ్మ సంబరాలు కోలాహలంగా కొనసాగాయి. ఉదయం నుండి రంగురంగుల పూలను తీసుకువచ్చి సింగిడిలోని వయ్యారాలను నీలకు దించినట్లుగా బతుకమ్మలను పేర్చారు.రాజులు ఇక్కడి నుండి పాలన కొనసాగించారా నడానికి ప్రాచీన గుర్తులు వాళ్లు నివసించిన కోట నిదర్శనంగా నిలుస్తున్నాయి.అలాంటి విశిష్టత కలిగిన రాజగోపాలపేట గ్రామ మహిళలకు రెండు సద్దుల బతుకమ్మల సంబరాలు జరుపుకునే అదృష్టం ఉందని సంతోషం వ్యక్తం చేశారు. ఏడు రోజుల సద్దుల బతుకమ్మ కి కోడళ్ళు,ఆడపడుచులు కలిసి ఎటు అత్తగారిళ్లలో,అటు తల్లిగారిళ్లలో జరుపుకొని యధావిధిగా 9 రోజుల సద్దుల బతుకమ్మ జరుపుకోవడం జరుగుతుంది.సద్దుల బతుకమ్మను పేర్చి ప్రతి ఒక్కరూ తమ ఇండ్ల ముందు ప్రధాన కూడలిలలో,గ్రామంలోని కోట ఆవరణలో జెండా గద్దె వద్ద బతుకమ్మ ఆటలాడి,గౌరమ్మ పూజలు చేయడం ఇక్కడ అనాటిగా వస్తున్న ఆనవాయితీ.ఆడపడుచుల గాజుల సవ్వడి దరువులుగా మారి ఉయ్యాల పాటలు ఒకే గొంతు రాగంలో రావడంతో బతుకమ్మ సంబరాలు అంబరాలు అంటాయి. గ్రామంలోని ఆడపడుచులు ఒకేచోట చేరి ఆప్యాయత అనురాగలతో కష్టసుఖాలను పంచుకోవడానికి సద్దుల బతుకమ్మ నిలువుగా మారుతుందని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం రాజగోపాలపేట పెద్ద చెరువు లో పోయిరా బతుకమ్మ మళ్ళీరా బతుకమ్మ అంటూ గౌరమ్మ పూజలను చేసి సద్దుల ప్రసాదాన్ని ఒకరికొకరు పంచుకొని తమ ఊరి ముచ్చట్లను నెమరు వేసుకుంటూ ఇండ్లకు చేరారు..

# గౌతమ్‌పూర్‌లో చెట్ల తొలగింపు బిల్లులపై వివాదం!

**ప్రజాధనం దుర్వినియోగంపై గ్రామస్థుల అనుమానాలు.. విచారణకు డిమాండ్**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అక్టోబర్ 16 (వుదయం ప్రతినిధి)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గౌతమ్‌పూర్ గ్రామపంచాయతీ రోజురోజుకూ వివాదాలకు కేంద్రంగా మారుతోంది. ఇప్పటికే గ్రామంలో కోతులు, కుక్కల బెడదను పరిష్కరించాలని కోరుతూ గ్రామసభను గ్రామస్థులు బహిష్కరించిన ఘటన చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. తాజాగా గ్రామపంచాయతీ పరిధిలోని కాలనీల్లో చెట్ల కొమ్మల తొలగింపు పనులకు సంబంధించిన బిల్లులపై కొత్త వివాదం తెరపైకి వచ్చింది.

గ్రామంలోని వివిధ కాలనీల్లో చెట్ల కొమ్మల తొలగింపు పనుల పేరుతో సమర్పించిన బిల్లుల్లో అవకతవకలు జరిగాయనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. చెట్ల కొమ్మలు తొలగించిన కూలీల వేతనాల కంటే ఎక్కువ బిల్లులు పెట్టారని ఆరోపణలు ప్రజల నుంచి వ్యక్తం అవుతున్నాయి. చేపట్టిన పనులకు, బిల్లుల్లో చూపించిన మొత్తాలకు మధ్య వ్యత్యాసం ఉందని, ఈ వ్యవహారంలో ప్రజాధనం దుర్వినియోగమైందేమోనని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. గత రెండు నెలల కింద గౌతంపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని మిలీనియం కోటర్స్ పరిధిలో చెట్ల కొమ్మలను తొలగించడానికి ముగ్గురు వ్యక్తులు రెండు రోజులు పనిచేస్తే నాలుగు రోజులు పని చేసినట్లుగా రికార్డులో నమోదు చేయడం గమనార్హం. వారికి రోజువారి వేతనం 1200 చొప్పున రికార్డులు నమోదు చేశారు. ఈ మధ్య రోజుల్లోనే మళ్లీ గౌతమ్ పూర్ కాలనీలలో చెట్ల కొమ్మలను తొలగించడానికి 61 వేల రూపాయల బిల్లును పెట్టారని గౌతమ్ పూర్ గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. రెండు రోజులు ఇద్దరు ముగ్గురు వ్యక్తులు కొమ్మలు నరికినందుకే 61 వేల బిల్లులు ఎలా ఖర్చు అవుతాయని ఆశ్చర్యానికి గురి అవుతున్నారు.బిల్లులపై అధికారుల పర్యవేక్షణ ఏదీ?గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాల్సిన బాధ్యత ఉంది. అలాంటప్పుడు చెట్ల కొమ్మల తొలగింపు పనులకు సంబంధించిన బిల్లులు ఏ ప్రాతిపదికన రూపొందించారు? పనుల పరిమాణాన్ని, ఖర్చులను అధికారులు పరిశీలించారా? క్షేత్రస్థాయిలో పనులను తనిఖీ చేసిన తర్వాతే బిల్లులకు ఆమోదం తెలిపారా? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.ఈ వ్యవహారంలో అధికారుల పర్యవేక్షణలో లోపాలున్నాయా? బిల్లుల పరిశీలనలో నిర్లక్ష్యం జరిగిందా? అనే అంశాలపై కూడా సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. అయితే, అధికారుల ప్రమేయం లేదా అక్రమ చెల్లింపులు జరిగినట్లు ఇప్పటివరకు నిర్ధారణ కాలేదు.

బహిరంగ విచారణ జరపాలని డిమాండ్చెట్ల కొమ్మల తొలగింపు పనులకు సంబంధించిన బిల్లులు, పనుల వివరాలు, ఖర్చుల లెక్కలను బహిరంగంగా పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని గౌతమ్‌పూర్ గ్రామస్థులు సొప్పరి క్రాంతి బిజెపి నాయకుడు తదితరులు కోరుతున్నారు. గ్రామపంచాయతీ నిధుల వినియోగంపై పారదర్శకత ఉండాలని, ప్రజాధనం దుర్వినియోగమైనట్లు విచారణలో తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో జరిగిన పనులను బిల్లులతో సరిపోల్చి, సంబంధిత అధికారుల పర్యవేక్షణను కూడా విచారణ పరిధిలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడిస్తారా? ఆరోపణలపై సమగ్ర విచారణ చేపడతారా? అన్నది వేచి చూడాలి.గౌతమ్ పూర్ పంచాయత్ సెక్రటరీ షర్మిల వివరణ కోరగా..గౌతమ్ పూర్ గ్రామపంచాయతీ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు పనుల్లో బిల్లుల విషయంలో అవకాతవకల్లు జరిగాయన్న విషయంపై గౌతంపూర్ గ్రామ పంచాయతీ సెక్రటరీ షర్మిల వివరణ కోరగా ఆమె మాట్లాడుతూ తీర్మానంలో రాసింది 61000 రెండు రోజులు పనిచేశారు గత రెండు నెలల ముందు కూడా మిలీనియం కోటర్స్ లో చెట్లు తొలగింపు ముగ్గురు వ్యక్తులు రెండు రోజులు పని చేసినందుకు 30000 రూపాయలు చెల్లించామని ఇవన్నీ తీర్మానం ప్రకారమే చేశాను నాదేముంది అని పంచాయతీ సెక్రటరీ తెలిపారు.

# గీతం ఘనంగా దండియా ఉత్సవం

**శుభారంభ్ పేరిట గర్బా, దండియా నృత్యాలు, సంగీతం, సాంస్కృతిక సందడి**

**పటాన్చెరు (వుదయం):**



హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, నవరాత్రి స్ఫూర్తిని పురస్కరించుకుని, 'శుభారంభ్ 2026' పేరిట ఉత్సాహభరితమైన దండియా ఉత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి వేలాది మంది విద్యార్థులు రంగురంగుల సాంప్రదాయ వస్త్రధారణలో హాజరయ్యారు. కళాకృతి విద్యార్థి క్లబ్ ఆధ్వర్యంలో, స్త్రీ శక్తి పర్యావరణ సామరస్యం, ప్రాంతీయ గుర్తింపునకు ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలతో ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సంగీతం, నృత్యం, సాంస్కృతిక ఉత్సాహంతో నిండిన గర్బా, దండియా నృత్యాలతో ఈ వేడుకలు ఉత్సాహభరితమైన సాయంత్రంగా కొనసాగాయి. ఈ కార్యక్రమం, గీతం ప్రాంగణ సంస్కృతిని, గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తూ, విభిన్న విద్యా విభాగాలకు చెందిన విద్యార్థుల మధ్య ఐక్యతను, స్నేహభావాన్ని పెంపొందించింది.శుభారంభ్, విద్యార్థులకు ఉమ్మడి సాంస్కృతిక అనుభవాల ద్వారా ఒకరితో మరొకరు మమేకమవడానికి, మధురమైన జ్ఞాపకాలను సృష్టించుకోవడానికి, కలిసికట్టుగా ఉండే ఆనందాన్ని పంచుకోవడానికి ఒక అవకాశాన్ని కల్పించింది.

# ఘనంగా శ్రీశ్రీశ్రీ కనకదుర్గమ్మ పండుగ వేడుకలు



**ప్రభ బండ్ల ఊరేగింపుతో మునగాలలో ఆధ్యాత్మిక సందడి**

**మునగాల, అక్టోబర్ 16 (వుదయం):**

మునగాల మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ కనకదుర్గమ్మ వారి పండుగ వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించి అమ్మవారిని రంగురంగుల పూలతో అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పండుగలో భాగంగా గ్రామ ప్రజలు ప్రభ బండ్లను ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారిని గ్రామ ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. ట్రాక్టర్లపై ఏర్పాటు చేసిన రంగురంగుల ప్రభలు, డప్పు వాయిద్యాలు, భక్తి గీతాల నడుమ సాగిన ఊరేగింపు కనులపండువగా నిలిచింది. భక్తులు ఉత్సాహంగా పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు, రాజకీయ నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రేపే సద్దుల బతుకమ్మ, మంగళవారం దసరా పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్

**జన్నారం, అక్టోబర్ 16 (వుదయం విలేఖరి)**



జన్నారం మండలంలోని పొనకల్ గ్రామపంచాయతీ ప్రజలు ఆదివారం రోజున సద్దుల బతుకమ్మ, మంగళవారం దసరా పండుగను జరుపుకోవాలని పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ కోరారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండుగల తేదీలపై గ్రామ ప్రజలకు ఎటువంటి సందిగ్ధత ఉండకూడదనే ఉద్దేశంతో వేద పండితులతో చర్చించి పండుగల తేదీలను ప్రకటించడం జరిగిందని అన్నారు. సద్దుల బతుకమ్మకు ప్రతి సంవత్సరం లాగే ఏర్పాట్లను ఘనంగా నిర్వహిస్తున్నామని, కావున మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సద్దుల బతుకమ్మను విజయవంతం చేయాలని కోరారు.అలాగే మంగళవారం రోజున జరిగే దసరా పండుగ కూడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని అన్నారు. కావున గ్రామస్తులు ఈ రెండు పండుగలను ప్రశాంత వాతావరణంలో సంతోషంగా ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి:నందు నాయక్

**జన్నారం,అక్టోబర్ 16 (వుదయం విలేఖరి)**

జన్నారం మండలంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షులు నందు నాయక్ మాట్లాడుతూ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.అనంతరం కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ సభ్యులకు శాలువాలతో సన్మానం చేశారు.అలాగే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పలువురు లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నందు నాయక్ అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్యూఐ జిల్లా అధ్యక్షులు సాహెల్ షా, పట్టణ అధ్యక్షులు మంద రాజేష్, మండల ప్రధాన కార్యదర్శులు మేకల మాణిక్యం, హేమంత్ చారి, ఆడెపు హన్మంతరావు, ఉపాధ్యక్షులు కండ్లే చంద్రయ్య, ఆకుల సత్యనారాయణ, కార్యదర్శులు రవి నాయక్, పాపగౌడ్, మల్కా లక్ష్మణ్, జడి రాజేశ్వర్, పద్మారావు, నాయిని రమేష్ గౌడ్, సభ్యులు ఎండీ. అజార్, మర్రిపెల్లి చంద్రయ్య, లకావత్ తిరుపతి, కోడి జుట్టు రాజన్న, చుంచు నర్సయ్య, రాహూల్ తదితరులు పాల్గొన్నారు

# *కరెంట్ కోతలు ఎండిపోతున్న పంటలు కాంగ్రెస్ పాలనపై మండిపడ్డ ఎమ్మెల్యే*



**ఝరాసంగం అక్టోబర్-16(వుదయం ప్రతినిధి)**

శుక్రవారం రోజు జహీరాబాద్ ఎమ్మెల్యే గారి, క్యాంపు కార్యాలయం లో *కరెంట్ కోతలు ఎండిపోతున్న పంటలపై మీడియా సమావేశం నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై మండిపడ్డారు*ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొణింటి.మాణిక్ రావు,మాట్లాడుతూబీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ వ్యవసాయ రంగానికి నిరంతరంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేశారని అన్నారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోసం రైతులు రోడ్డెక్కే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రస్తుతం పొట్ట దశలో ఉన్న వరికి నీరందడం ఎంతో ముఖ్య మని, కొన్ని రోజులుగా విద్యుత్ కోతలు విధిస్తుండడంతో పంటలు ఎండిపోయి అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. బోర్లు, బావుల కింద సాగవుతున్న కొద్దిపాటి పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని వాపోయారు.రోజంతా కలిపితే 6 నుంచి 7గంటల కరెంట్ సరఫరా కావడం లేదని,అందులో అప్రకటిత కోతలు విధిస్తున్నారని మండి పడ్డారు.లోవోల్టేజీ సమస్యతో మోటర్లు కాలిపోతున్నాయని వాపోయారు.రేవంత్ రెడ్డి పాలనలో కొత్త ఒక్క చెక్‌డ్యామ్ కట్టారా? ఒక్క చెరువునైనా బాగుచేశారా? సాగు నీరు అందించారా?నెట్టెంపాడు "కేసీఆర్" కట్టిన ప్రాజెక్టులను, వాటి మోటర్లను కూడా నడుపడం కాంగ్రెస్‌కు చేతకావడం లేదని మండిపడ్డారు..కరెంట్ కోతల వల్ల పంటలు ఎండిపోతున్న రైతులకు తక్షణ సహాయం అందించాలి.కాలిపోయిన మోటార్లు, ట్రాన్స్ ఫార్మర్లను వెంటనే మరమ్మతు చేయాలి.విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు నిల్వలు, సరఫరా పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి.విద్యుత్ అధికారులపై చర్యలతో సరిపెట్టకుండా, ప్రభుత్వ స్థాయిలో జరిగిన ప్రణాళికా లోపాలపై సమీక్ష జరపాలి.రైతులకు నిరంతర విద్యుత్ అందించే కార్యాచరణను గడువుతో ప్రకటించాలి అని డిమాండ్ చేశారు... వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా చేయని యెడల బిఆర్ఎస్ పార్టీ తరుపున రైతుల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు.....ఈ కార్యక్రమంలో మాజి మార్కెట్ చైర్మన్ గుండప్ప,మాజి ఆత్మ చైర్మన్ విజయ్ కుమార్,ఝరాసంఘం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, కోహిర్ మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు,ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బండి మోహన్,కౌన్సిలర్ లు దీపక్,జాకీర్,మహిపాల్ యాదవ్, విశ్వేశ్వర్,నాయకులు చంద్రు,కరణ్ తదితరులు పాల్గొన్నారు.....

# ధనలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చిన వాసవి మాత అంగరంగ వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం



**నాగర్ కర్నూల్, అక్టోబర్ 15 (వుదయం బ్యూరో):**

జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారిని ఒక్కో అవతారంలో అలంకరిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.ఇందులో భాగంగా శుక్రవారం నాడు ఆలయ మూల విరాట్‌ను ధనలక్ష్మి దేవి రూపంలో సుందరంగా అలంకరించారు. ధన లక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చిన వాసవి మాతను దర్శించుకునేందుకు ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఉదయం ఆలయ అర్చకులు జోషి పాండురంగ శర్మ ఆధ్వర్యంలో విశేష అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ అభిషేక కార్యక్రమంలో పలువురు దంపతులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం సామూహిక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సామూహిక పూజలో పట్టణానికి చెందిన పలువురు మహిళలు, దంపతులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.ఆలయ అర్చకులు జోషి పాండురంగ శర్మ వేద మంత్రాలతో సామూహిక పూజా కార్యక్రమాలను జరిపించారు. అనంతరం గణపతి, సుబ్రహ్మణ్య, దుర్గా దేవి పూజలు నిర్వహించి మహా నీరాజనం సమర్పించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించారు.మధ్యాహ్నం వాసవి భజన మండలి ఆధ్వర్యంలో భక్తి భజన కార్యక్రమాలు చేపట్టారు. భజన మండలి సభ్యులు భక్తి పాటలతో భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంకాలం ప్రదోష పూజ అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి ఉపాసకులు నాగరాజు ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో పలువురు దంపతులు పాల్గొని స్వామివారి కళ్యాణాన్ని కనులారా తిలకించారు.ఈ కార్యక్రమాల్లో ఆలయ అధ్యక్షుడు మిడిదొడ్డి అంజయ్య, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బిల్లకంటి హరిబాబు, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు, వాసవి భజన మండలి సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు

# ప్రజలకు కరెంట్ కష్టాలు.. వీధి దీపాలకు పగలే పండుగ!



**విద్యుత్ కోతలతో జనం ఉక్కిరిబిక్కిరి.. గ్రామాల్లో అధికారుల పర్యవేక్షణ గాలికి!**

**గద్వాల, అక్టోబర్ 16 (వుదయం బ్యూరో)**

ఒకవైపు విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడు తుంటే.. మరోవైపు పలు గ్రామాల్లో పగటి పూట సైతం వీధి దీపాలు వెలుగుతుం డటం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ప్రజలకు విద్యుత్ పొదుపుపై నీతులు చెప్పే యంత్రాంగం.. ప్రభుత్వ విద్యుత్ వృథాను అరికట్టడంలో మాత్రం ఎందుకు విఫలమవుతోందన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో విద్యుత్ సరఫరా అంతరాయాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో, పగటిపూట వీధి దీపాలు వెలుగుతూ ఉండటం బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా కనిపిస్తోంది. గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణను పర్యవేక్షించాల్సిన అధికారులు, గ్రామ పంచాయతీ పాలకులు ఏం చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. ప్రజాధనంతో నిర్వహించే విద్యుత్ వ్యవస్థలో ఇంతటి నిర్లక్ష్యం ఎందుకని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పర్యవేక్షణ ఏది.. బాధ్యత ఎవరిది? వీధి దీపాలు ఎప్పుడు వెలగాలి.. ఎప్పుడు ఆర్పాలి అన్న కనీస పర్యవేక్షణ కూడా లేకపోతే గ్రామాల్లో పరిపాలన ఎలా సాగుతోందన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. విద్యుత్ వృథాను అరికట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ, పగటిపూట దీపాలు వెలుగుతుండటాన్ని గుర్తించి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఇప్పటికైనా కళ్లు తెరుస్తారా? జోగులాంబ గద్వాల జిల్లాలోని గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణపై అధికారులు తక్షణమే దృష్టి సారించాలి. పగటిపూట అనవసరంగా వెలుగుతున్న దీపాలను నియంత్రించి, విద్యుత్ వృథాను అరికట్టేందుకు పటిష్ఠమైన పర్యవేక్షణ చేపట్టాలి. గ్రామపంచాయతీ పాలకులు, సంబంధిత సిబ్బంది తమ బాధ్యతలను గుర్తించి వ్యవహరించాలి. ప్రజలకు కోతలు.. వీధి దీపాలకు వెలుగులు! జనం ఇబ్బందులు అధికారులకు కనిపించడం లేదా? విద్యుత్ వృథాను అరికట్టాల్సిన బాధ్యతను ఎవరు నిర్వర్తిస్తారు? ఇప్పటికైనా అధికారులు, గ్రామపంచాయతీ పాలకులు స్పందించి చర్యలు తీసుకుంటారా.. లేక ప్రజల ప్రశ్నలను పట్టించుకోకుండా వదిలేస్తారా? అన్నది వేచి చూడాలి.

# ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి ఏఐటీయూసీ



**నాగర్ కర్నూల్, అక్టోబర్ 16 (వుదయం ప్రతినిధి):**

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ డిమాండ్ చేశారు.జిల్లా కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలందించిన సిబ్బందికి కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ వ్యవస్థలోనే కొనసాగించడం దారుణమన్నారు.రాజకీయ నాయకులు ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలుగా రెండు, మూడు సార్లు ఎన్నికైతే పింఛన్లు ఇస్తున్న ప్రభుత్వం, ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగులతో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం 100 శాతం గ్రాస్ జీతం చెల్లించాలని, ప్రతి నెల 5వ తేదీలోపు జీతాలు ఇవ్వాలని, ఏటా 5 శాతం ఇంక్రిమెంట్, 8 శాతం లాయల్టీ బోనస్ అందించాలని, 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, జీవో 1195ను పునఃపరిశీలించి బదిలీ విధానాన్ని రద్దు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బిజ్జా శ్రీనివాసులు, ఎన్‌హెచ్ఎం జేఏసీ అధ్యక్షులు డాక్టర్ బాలకృష్ణ, కార్యదర్శి డాక్టర్ డి. కుమార్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ జగన్, డాక్టర్ మహతి, డాక్టర్ సంధ్యారాణి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులను అడ్డం పెట్టుకుని రౌడీ రాజకీయం బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బైకాని శ్రీనివాస్ యాదవ్



**నాగర్ కర్నూల్, అక్టోబర్ 16 (వుదయం బ్యూరో):**

పోలీసులను అడ్డం పెట్టుకుని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇద్దరూ రౌడీ రాజకీయం చేస్తున్నారని బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బైకాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు.శుక్రవారం అక్రమ కేసులో అరెస్టయిన మాజీ జడ్పీటీసీ శ్రీశైలంను పరామర్శించిన అనంతరం నాగర్‌కర్నూల్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూమార్కెట్ చైర్మన్ రమణారావు మక్కల కొనుగోలులో అవినీతికి పాల్పడ్డారని ప్రశ్నించినందుకే మాజీ జడ్పీటీసీ శ్రీశైలంపై అక్రమ కేసు పెట్టి జైలులో పెట్టారని, కోర్టులో కూడా బెయిల్ రాకుండా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇద్దరూ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలపై ఇలాగే దాడులు కొనసాగిస్తే గొల్ల, కురుమలతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా నాగర్‌కర్నూల్ పోలీసులు పద్ధతి మార్చుకోవాలని, లేకపోతే వేలమంది బీసీలతో పోలీస్ స్టేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

# అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలు



*** రెండేళ్లలో సిద్దిపేట జిల్లాకు 15 వేల ఇందిరమ్మ ఇళ్లు**
*** రామలింగేశ్వర గార్డెన్‌లో 2బిహెచ్‌కే పట్టాలు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ**

**అక్బర్ పేట-భూంపల్లి, అక్టోబర్ 16, వుదయం :**

పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులందరికీ పట్టాలు అందజేస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు చర్యలు చేపడుతోందని తెలిపారు. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని రామలింగేశ్వర గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమావతి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..గత రెండేళ్లలో సిద్దిపేట జిల్లాకు 15 వేల ఇందిరమ్మ ఇళ్లు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో పెంకుటిళ్లలో నివసిస్తున్న నిరుపేదలకు సైతం ఇందిరమ్మ ఇళ్లు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రూ.23 వేల కోట్ల రుణమాఫీ చేసినట్లు వివరించారు. ఎల్‌నినో ప్రభావం తెలంగాణతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల్లో కనిపిస్తోందని మంత్రి పేర్కొన్నారు. రానున్న రోజుల్లో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల సాగుపై ఆలోచనాత్మక నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో సుమారు 35 లక్షల బోర్లు ఉండటంతో వ్యవసాయానికి అధికంగా విద్యుత్ వినియోగం అవుతోందని తెలిపారు.2020లో కరోనా సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన సూచనల మేరకు ప్రజలంతా సహకరించినట్లుగానే, ప్రస్తుత పరిస్థితుల్లోనూ ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి కోరారు. రైతులను ఏ విధంగా ఆదుకోవాలనే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చర్చలు జరిపినట్లు వెల్లడించారు.పేదలకు ఇళ్ల పట్టాలు అందించడం, అర్హులైన కుటుంబాలకు ఆర్థిక సహాయం చేరవేయడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత చేరువవుతున్నాయని కార్యక్రమంలో పేర్కొన్నారు.

# ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా ఎమ్మెల్యే డాక్టర్ రాజేశ్ రెడ్డి హామీ



**నాగర్ కర్నూల్, అక్టోబర్ 16 (వుదయం బ్యూరో):**

జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ముఖ్యమంత్రి, వైద్యారోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్ రెడ్డి హామీ ఇచ్చారు. ఎన్‌హెచ్ఎం జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాలుగో రోజుకు చేరింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జేఏసీ ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను విన్నవించారు.కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ రెగ్యులరైజేషన్, సమాన పనికి సమాన వేతనం తదితర ప్రధాన డిమాండ్లను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గత మూడు రోజులుగా కొనసాగుతున్న సమ్మె, ప్రజారోగ్య సేవల్లో ఎన్‌హెచ్ఎం సిబ్బంది అందిస్తున్న సేవలను వివరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలను గుర్తించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగుల ప్రధాన డిమాండ్లను సీఎం, వైద్యారోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే స్పందన పట్ల జేఏసీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకునే వరకు ఐక్యంగా, శాంతియుతంగా పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# రైతుల విద్యుత్ కష్టాలు తీర్చాలి



*** మంత్రి వివేక్ వెంకటస్వామికి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి వినతి**
*** వందలాది మంది రైతులతో కలిసి వ్యవసాయ విద్యుత్ సమస్యలపై వినతిపత్రం**

**దుబ్బాక ప్రతినిధి ,(అక్బర్‌పేట –భూంపల్లి) అక్టోబర్ 16, వుదయం:**

వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లోవోల్టేజ్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు తక్షణ ఉపశమనం కల్పించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కోరారు. రైతాంగం ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తూ వందలాది మంది రైతులతో కలిసి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం సమర్పించారు. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం నగరం గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సంక్షేమ పథకాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామిని కలిసి దుబ్బాక నియోజకవర్గ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే వివరించారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో నిర్దిష్ట సమయపాలన లేకపోవడం, లోవోల్టేజ్, తరచూ విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. పంటలకు కీలకమైన సమయంలో విద్యుత్ సమస్యలు తలెత్తడంతో సాగు పనులకు ఆటంకం కలుగుతోందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించడంతో పాటు, సరఫరా సమయాలను ముందుగానే ప్రకటించాలని, పగటిపూట విద్యుత్ సరఫరాకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. లోవోల్టేజ్ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు, వ్యవసాయ మోటార్లు తరచూ కాలిపోతుండటంతో రైతులు అదనపు ఆర్థిక భారాన్ని మోయాల్సి వస్తోందని ఎమ్మెల్యే వివరించారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను 24 నుంచి 48 గంటల్లోగా ఉచితంగా మార్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందితేనే రైతులు సకాలంలో సాగు పనులు చేపట్టగలరని కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలతో పంటలకు నష్టం వాటిల్లకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రైతాంగం ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. దుబ్బాక నియోజకవర్గ రైతుల సమస్యలను పరిష్కరించి వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని మంత్రి వివేక్ వెంకటస్వామికి విజ్ఞప్తి చేశారు.

# పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర కార్యవర్గంలో తాండూరు ఉపాధ్యాయుల హవా!




**తాండూరు, అక్టోబర్ 16**

పీఆర్టీయూ టీఎస్ 6వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో తాండూరు మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులు రాష్ట్ర కార్యవర్గానికి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా శ్రీ నాగప్ప ఎన్నిక కావడం తాండూరు ఉపాధ్యాయ వర్గాల్లో విశేష ప్రాధాన్యత సంతరించుకుంది. ఆయనతో పాటు పలువురు ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టారు.రాష్ట్ర కార్యవర్గంలో ఎన్నికైన వారురాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు:
1. నాగప్ప2. రామ్నర్సింహ రెడ్డిరాష్ట్ర ఉపాధ్యక్షులు:1. డి. రవీందర్2. వీరేశం3.మధుసూదన్ రెడ్డిరాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు:1.అంబమ్మ2. ఉమామహేశ్వరి3. మహాలక్ష్మిరాష్ట్ర కార్యదర్శులు:1. బబ్యా నాయక్2. హెచ్. అనిల్ కుమార్3. ఎన్. సంతోష్ కుమార్4. దస్తప్ప5. ఐనెల్లి శ్రీనివాస్రాష్ట్ర మహిళా కార్యదర్శి:లీలావతినూతన కార్యవర్గానికి శుభాకాంక్షలురాష్ట్ర కార్యవర్గానికి ఏకగ్రీవంగా ఎన్నికైన తాండూ మండల ఉపాధ్యాయులకు రాష్ట్ర పత్రిక సంపాదకులు బాకారం జైపాల్ రెడ్డి, మండల అధ్యక్షులు జొన్నల వినోద్ కుమార్, మండల జనరల్ సెక్రటరీ పట్లోల్ల పురుషోత్తం రెడ్డి, మండల అసోసియేట్ అధ్యక్షులు మున్నూరు బాల్ రాజ్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులు సంఘ బలోపేతానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. తాండూరు మండల ఉపాధ్యాయులకు రాష్ట్ర కార్యవర్గంలో ప్రాధాన్యత లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన మాజీ జెడ్పిటిసి సిద్రాల శ్రీనివాస్



***కుటుంబానికి అండగా ఉంటామని హామీ**

**యాలాల అక్టోబర్ 16 వుదయం ప్రతినిధి,:-**

యాలాల మండలం బాలాపూర్ గ్రామానికి బిఆర్ఎస్ నాయకుడు రాజు నాయక్ కుటుంబాన్ని యాలాల మాజీ జెడ్పిటిసి సిద్ధాల శ్రీనివాస్ పరామర్శించారు. యాలాల మండలం బానాపూర్ గ్రామానికి చెందిన,బిఆర్ఎస్ నాయకుడు రాజు నాయక్ చిన్నమ్మ సీతా బాయ్ మృతి చెందింది. విషయాన్ని తెలుసుకున్న యాలాల మాజీ జెడ్పిటిసి సిద్ధాల శ్రీనివాస్ శుక్రవారం వారి కుటుంబాన్ని పరామర్శించి సీతా బాయ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట రాఘవపూర్ మాజీ సర్పంచ్ వెంకటయ్య, అన్నాసాగర్ మాజీ సర్పంచ్ సాయిలు ముదిరాజ్, నాయకులు హాజీపూర్ రవి, జక్కపల్లి గణేష్, బంటు కిష్టప్ప శంకర్ నాయక్ మాణిక్య నాయక్ గోపాల్ రాజు నాయక్ తిరుపతి ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

# జ్ఞాన సరస్వతి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు 6వ రోజు మహాలక్ష్మీ దేవి అలంకరణలో అమ్మవారు



**అచ్చంపేట,అక్టోబర్ 16:,(వుదయం ప్రతినిధి ):**

పట్టణంలోని శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఆరవ రోజు అమ్మవారు శ్రీ మహాలక్ష్మి దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చి కటాక్షించారు.శుక్రవారం పూజా కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సతీమణి డాక్టర్ అనురాధ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన నిర్వహించి, ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం పద్మశాలి మహిళ సంఘం అధ్యక్షురాలు పులిజాల కల్యాణి ఆధ్వర్యంలో డాక్టర్ అనురాధ ను ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి, అమ్మవారి ప్రసాదం అందజేశారు.సన్మాన అనంతరం డాక్టర్ అనురాధ మహిళలతో కలిసి ఉత్సాహంగా బతుకమ్మ ఆటలు, కోలాటాలుఆడారు. బతుకమ్మ పాటలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. మహిళలందరూ ఆనందోత్సాహాలతో నృత్యాలు చేశారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి మహిళ సంఘం అధ్యక్షురాలు పులిజాల కల్యాణి, పద్మశాలి సంఘం అధ్యక్షులు కోట కిషోర్, శివాలయ అధ్యక్షులు దాసు నాగరాజు చిలువేరు శ్రావణి, కోట ప్రశాంతి, దాసపత్రి శకుంతల, ఇమ్మడి రాజేశ్వరి, వనం సరిత మరియు పద్మశాలి మహిళ సంఘం సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

జ్ఞాన సరస్వతి ఆలయంలో మహాలక్ష్మీ అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు సతీమణి డాక్టర్ అనురాధకు ఘన సన్మానం మహిళలతో కలిసి బతుకమ్మ, కోలాటం

# బొడ్రాయి, మైసమ్మ దీవెనలతో సుభిక్షం

**బిజినపల్లి, అక్టోబర్ 16 (వుదయం ప్రతినిధి):**

బిజినపల్లి మండలం కారుకొండ తండా గ్రామ పంచాయతీలో శుక్రవారం బొడ్రాయి, మైసమ్మ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామదేవతల ఆశీస్సులతో కారుకొండ తండా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నారు.గ్రామదేవతల పట్ల భక్తి, విశ్వాసాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ఇలాంటి మధ్య ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. యువత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ప్రతి కుటుంబంలో ఆనందం నిండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దేవి కార్ డెకోర్ వరల్డ్‌ను ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి



**ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 16:**

ఆదిలాబాద్ పట్టణంలోని మావల ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన దేవి కార్ డెకోర్ వరల్డ్‌ను ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూంను సందర్శించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన వ్యాపార సంస్థను ప్రారంభించిన నిర్వాహకులు వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.పట్టణంలో నూతన వ్యాపార సంస్థల ఏర్పాటుతో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షోరూం నిర్వాహకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌కు వినతి
- సమ్మెకు ఏఐటీయూసీ నాయకుల సంపూర్ణ మద్దతు

**నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి అక్టోబర్ 16**



నల్లగొండ పట్టణంలో తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మె చేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు శుక్రవారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పని చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, అప్పటివరకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు 100 శాతం గ్రాస్ వేతనం చెల్లించాలని కోరారు. ఐదు శాతం వార్షిక ఇంక్రిమెంట్లు, ఎనిమిది శాతం లాయల్టీ బోనస్, పీఆర్సీ ప్రయోజనాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, ఆరోగ్య భద్రత కల్పించాలని కోరారు.

ఎన్నో ఏళ్లుగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, న్యాయం జరిగేలా సహకరించాలని ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌ను ఉద్యోగులు కోరారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని తెలిపారు.

ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నల్లగొండలో ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక సమ్మెకు ఏఐటీయూసీ నాయకుడు పల్లా దేవేందర్‌రెడ్డి, ఆర్టీసీ యూనియన్ నాయకుడు కె.ఎస్.రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మద్దతు తెలిపారు. రెగ్యులరైజేషన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఉద్యోగులకు 100 శాతం గ్రాస్ వేతనం చెల్లించాలని, ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, ఐదు శాతం వార్షిక ఇంక్రిమెంట్లు, ఎనిమిది శాతం లాయల్టీ బోనస్ అమలు చేయాలని కోరారు. పీఆర్సీ ప్రయోజనాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజా ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించి, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు న్యాయం చేయాలని నాయకులు కోరారు. డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం కొనసాగిస్తామని ఉద్యోగులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు డాక్టర్ హరిప్రియ, డాక్టర్ దయానంద్, ఉపేందర్, డాక్టర్ రమేశ్, అనిల్, సంతోష్, డాక్టర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు

- రైతుల మొదటి పంటకే దిక్కులేదు.. రెండో పంట వేయొద్దనడం సిగ్గుచేటు
- తెలంగాణ నీటిని వదిలేసి ఆంధ్ర పాలకులకు కానుకగా ఇచ్చారు
- సింగరేణి బొగ్గు ఉత్పత్తి తగ్గించి విదేశీ బొగ్గు దిగుమతుల్లో కమిషన్ల దందా
- వ్యవసాయానికి విద్యుత్ సరఫరా, ఎండిన పంటలకు పరిహారంపై తక్షణ శ్వేతపత్రం విడుదల చేయాలి
- బిఆర్ఎస్ నేతలు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్య ధ్వజం

**ఖమ్మం వుదయం బ్యూరో అక్టోబర్ 16**

ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం (తెలంగాణ భవన్) లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్య కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడవకముందే రాష్ట్రంలో పరిపాలన పూర్తిగా గాడితప్పిందని విమర్శించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన గ్యారంటీ కార్డులు, రాసిచ్చిన బాండ్ పేపర్లకు విలువ లేకుండా పోయిందని అన్నారు. కేసీఆర్ గారి పదేళ్ల పాలనలో 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్, ఇంటింటికీ నల్లా నీళ్లు, మిషన్ కాకతీయతో చెరువులను నింపి వ్యవసాయాన్ని పండుగలా మార్చారని గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో మళ్లీ పాత రోజులు వచ్చాయని, బోర్ల దగ్గర బిందెలతో ఎదురు చూసే దుస్థితి, కరెంట్ లేక మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయే విపత్కర పరిస్థితులు దాపురించాయని ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 15,000 మెగావాట్లు ఉంటే, కేవలం 6,700 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి చేస్తూ మిగతా లోటును పూడ్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రెండో పంట వేయొద్దని రైతులకు ఉచిత సలహాలు ఇస్తున్న మంత్రులు.. తమ వ్యాపారాలు, కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్టులు, 15 శాతం కమీషన్ల దందాలను ఆపుకుంటారా అని సూటిగా ప్రశ్నించారు. విత్తన కంపెనీలకు నోటీసులు ఇచ్చి రెండో పంటకు విత్తనాలు అమ్మొద్దని చెప్పడం భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే దుర్మార్గమైన చర్య అని ధ్వజమెత్తారు.

మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ: నల్ల బంగారం ఉన్న గడ్డ మన తెలంగాణ అని, కావలసినన్ని బొగ్గు నిక్షేపాలు ఉన్నప్పటికీ కృత్రిమంగా కొరత సృష్టించి థర్మల్ పవర్ ఉత్పత్తిని తగ్గించారని విమర్శించారు. 2023-24లో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగితే, ప్రస్తుత ఏడాదిలో దాన్ని 58 మిలియన్ టన్నులకు ఎందుకు తగ్గించారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సింగరేణిని నిర్వీర్యం చేసి విదేశీ బొగ్గు దిగుమతి పేరిట భారీగా కమిషన్లు దండుకుంటున్నారని దుయ్యబట్టారు.

**బీఆర్ఎస్ పార్టీ ప్రధాన డిమాండ్లు:**

– రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ రంగానికి ఎలాంటి ఆటంకం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి.

– నీరు, విద్యుత్ అందక ఎండిపోతున్న పంటలకు తక్షణమే నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలి.

– కాలిపోయిన వ్యవసాయ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లను ప్రభుత్వ ఖర్చుతో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలి.

– విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, బొగ్గు నిల్వలు, సరఫరా వివరాలపై ప్రభుత్వం సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలి.

– సింగరేణి టెండర్లు, బొగ్గు ఉత్పత్తి తగ్గింపు, విదేశీ బొగ్గు దిగుమతులపై సమగ్ర విచారణ జరిపించాలి.

– సింగరేణి వాటాల విక్రయం, ప్రైవేటీకరణ ఆలోచనలపై ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన వైఖరి ప్రకటించాలి.

– అధికారులను బలిపశువులను చేయడం ఆపి, ప్రణాళికా లోపాలను సరిదిద్దుకుని రైతులకు నిరంతర విద్యుత్ అందించే స్పష్టమైన గడువుతో కూడిన కార్యాచరణను ప్రకటించాలి.

ఈ సమావేశంలో మండల & నగర పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, పగడాల నాగరాజు, నాయకులు బత్తుల మురళి, పగడాల నరేందర్, బలుసు మురళీకృష్ణ, యలమద్ది రవి, మహమ్మద్ రఫీ, దరిపెల్లి వీరబాబు మరియు తదితరులు పాల్గొన్నారు.



## సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు



**మహిళా సిబ్బందితో కలిసి సంబరాల్లో పాల్గొన్న ఎస్పీ కె. నరసింహ**

**సూర్యాపేట అక్టోబర్ 16 , వుదయం ప్రతినిధి**

సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మహిళా పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, చిన్నారుల సమక్షంలో జరిగిన ఈ వేడుకలను జిల్లా ఎస్పీ శ్రీ కె. నరసింహ ఐపీఎస్ ప్రారంభించి, మహిళా సిబ్బందితో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మహిళా పోలీసు సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ఇలాంటి వేడుకలు సిబ్బంది మధ్య ఆత్మీయతను, ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. పోలీసు సిబ్బంది అందరూ ఒక కుటుంబంలా కలిసిమెలిసి ఉండాలని, విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించేందుకు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. జిల్లా పోలీస్ శాఖ తరపున జిల్లా ప్రజలకు, పోలీసు సిబ్బందికి బతుకమ్మ, విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి మంజు భార్గవి, డీఎస్పీ నరసింహ చారి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, జానయ్య, మహిళా సూపరింటెండెంట్లు సబితా రాణి, శ్రీదేవి, మహిళా ఎస్ఐలు ఝాన్సీ రాణి, తేజస్విని, మహిళా సిబ్బంది అరుణ, కవిత, జ్యోతి, పోలీసు సంఘం అధ్యక్షులు రమేష్, సెక్రటరీ కిరణ్, సంఘం సభ్యులు, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీశ్రీశ్రీ కనకదుర్గమ్మ పండుగ వేడుకలు

**ప్రభ బండ్ల ఊరేగింపుతో మునగాలలో ఆధ్యాత్మిక సందడి**

**మునగాల, అక్టోబర్ 16 (వుదయం):**



మునగాల మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ కనకదుర్గమ్మ వారి పండుగ వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించి అమ్మవారిని రంగురంగుల పూలతో అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పండుగలో భాగంగా గ్రామ ప్రజలు ప్రభ బండ్లను ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారిని గ్రామ ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. ట్రాక్టర్లపై ఏర్పాటు చేసిన రంగురంగుల ప్రభలు, డప్పు వాయిద్యాలు, భక్తి గీతాల నడుమ సాగిన ఊరేగింపు కనులపండువగా నిలిచింది. భక్తులు ఉత్సాహంగా పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు, రాజకీయ నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్నికల హామీ మేరకు కట్టుకాలువ శుభ్రత పనులు ప్రారంభం

- గ్రామ పంచాయతీ నిధులతో పనులు చేపట్టిన సర్పంచ్ నల్లపాటి ప్రమీల శ్రీనివాస్
- కట్టుకాలువల నిర్వహణతో మురుగునీటి సమస్యలకు పరిష్కారం.. గ్రామ ప్రజలకు మెరుగైన పారిశుధ్యం

**మునగాల, అక్టోబర్ 16 (వుదయం):**



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మునగాల మండల కేంద్రంలో కట్టుకాలువ శుభ్రత పనులను గ్రామ సర్పంచ్ నల్లపాటి ప్రమీల శ్రీనివాస్ ప్రారంభించారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ నిధుల నుంచి ఈ పనులను చేపట్టారు. కట్టుకాలువలో పేరుకుపోయిన మట్టి, చెత్తాచెదారం తొలగించి నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చర్యలు చేపడుతున్నారు.

**కట్టుకాలువల నిర్వహణ ఎంతో కీలకం**

గ్రామాల్లో కట్టుకాలువలు పారిశుధ్య నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు, వర్షపు నీరు సక్రమంగా ప్రవహించేందుకు కాలువలు ఉపయోగపడతాయి. కాలువల్లో చెత్తాచెదారం, మట్టి పేరుకుపోవడం వల్ల నీటి ప్రవాహం నిలిచిపోయి మురుగునీరు రోడ్లపైకి చేరే అవకాశం ఉంటుంది. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కోవడమే కాకుండా పరిసర ప్రాంతాల్లో దుర్వాసన, దోమల వ్యాప్తి వంటి సమస్యలు తలెత్తుతాయి.

ముఖ్యంగా వర్షాకాలంలో కాలువలు పూడిపోవడం వల్ల వర్షపు నీరు నిలిచిపోయి రహదారులు, నివాస ప్రాంతాల్లో ఇబ్బందులు ఏర్పడే ప్రమాదం ఉంది. అందువల్ల కాలువల్లో పేరుకుపోయిన పూడికను ఎప్పటికప్పుడు తొలగించడం, చెత్తాచెదారం వేయకుండా చర్యలు తీసుకోవడం, నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడటం ఎంతో అవసరం. కట్టుకాలువలను క్రమం తప్పకుండా శుభ్రం చేయడం ద్వారా మురుగునీటి నిల్వలను తగ్గించి గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవచ్చు.

**గ్రామాభివృద్ధిలో పారిశుధ్యానికి ప్రాధాన్యత**

గ్రామ ప్రజలకు మెరుగైన పారిశుధ్య వసతులు కల్పించడం, మురుగునీటి సమస్యలను తగ్గించడం, పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పడం గ్రామపంచాయతీ బాధ్యతల్లో ముఖ్యమైనవి. ఈ నేపథ్యంలో గ్రామపంచాయతీ నిధులతో కట్టుకాలువ శుభ్రత పనులు చేపట్టడం స్థానిక పారిశుధ్య నిర్వహణలో భాగంగా నిలుస్తోంది. కాలువల శుభ్రతతో పాటు వాటి నిర్వహణపై కూడా దృష్టి సారిస్తే దీర్ఘకాలికంగా ప్రయోజనం కలుగుతుంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కట్టుకాలువ శుభ్రత పనులు ప్రారంభించడంపై పలువురు గ్రామ ప్రజలు సర్పంచ్ నల్లపాటి ప్రమీల శ్రీనివాస్‌ను అభినందించారు. గ్రామంలో పారిశుధ్య సమస్యల పరిష్కారానికి, ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడానికి అవసరమైన చర్యలు కొనసాగించాలని వారు ఆకాంక్షించారు.

## ఎల్‌నినో ప్రభావం: సూక్ష్మ స్థాయి ప్రణాళికలు రూపొందించాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్
- తాగునీరు, సాగునీరు, విద్యుత్, ఉపాధి హామీ పనులపై కలెక్టరేట్ లో ఉన్నతస్థాయి సమీక్ష

**సూర్యాపేట, అక్టోబర్ 26, వుదయం ప్రతినిధి**



ఎల్ నినో ప్రభావం వల్ల జిల్లాలో ప్రజలు తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్, ఉపాధి హామీ పనులు, వైద్య ఆరోగ్యం తదితర అంశాలలో ఇబ్బందులు పడకుండా సూక్ష్మ స్థాయి ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎల్ నినో ప్రభావం, వ్యవసాయ పంటల పరిస్థితి, సాగునీరు, తాగునీరు, విద్యుత్, వీబీజీ రాంజీ ఉపాధి హామీ పనులు, భూగర్భ జలాలపై ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఏవోలు, ఎంపీఓలు, మున్సిపల్ కమిషనర్లు, వ్యవసాయం, విద్యుత్, ఇరిగేషన్, హార్టికల్చర్, పశుసంవర్ధక శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో సాధారణంగా 572 మి.మీ వర్షపాతం ఉండాల్సి ఉండగా 438 మి.మీ మాత్రమే నమోదైంది. గతేడాది ఇదే నెలలో 719 మి.మీ నమోదైందని, కేవలం తిరుమలగిరి, మద్దిరాల, మట్టంపల్లి, మేళ్లచెరువు మండలాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం ఉందన్నారు. రైతులు వరి వేయకుండా పెసర్లు, కందులు, ఉద్యాన పంటలు, రబీలో ఉలవలు వంటి తక్కువ నీటి పంటలు వేసేలా అవగాహన కల్పించాలని, డ్రిప్, స్ప్రింక్లర్ల వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. డిసెంబర్ చివరి నాటికి ఎల్ నినో ప్రభావం తారస్థాయికి చేరే అవకాశం ఉందని, ఇప్పటికే సగం ప్రాంతాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. తాగునీటికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, జూలై వరకు ప్రతి గ్రామం, ప్రతి ఇంటికి తాగునీరు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రిజర్వాయర్ల నీటిని చివరి గ్రామం వరకు ఎలా తీసుకెళ్లాలో, ఎన్ని వాటర్ ట్యాంకులు పనిచేస్తున్నాయో గ్రామాల వారీగా నివేదిక రూపొందించాలన్నారు. పశుగ్రాసం, తాగునీటి వనరులను ముందే గుర్తించాలని, విద్యుత్ ఆదా, సోలార్ విద్యుత్, సోలార్ మోటార్లు, సూర్యగృహ పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

భూగర్భ జలాల పెంపునకు వీబీజీ రాంజీ కింద నీటి సంరక్షణ పనులు, ప్రతి గ్రామంలో మ్యాజిక్ సోక్ పిట్లు, కమ్యూనిటీ సోక్ పిట్లు, నీటి నిల్వ కట్టడాలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ట్రాక్టర్, వాటర్ ట్యాంకు అందుబాటులో ఉంచాలని, లేనిచోట కొత్తవి కొనుగోలు చేయాలని డీపీఓను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్ఓ ప్రేమ్ రాజ్, జడ్పీ సీఈవో శిరీష, డీఆర్డీఓ సన్యాసయ్య, డీఏవో శ్రీధర్ రెడ్డి, ఇరిగేషన్, ఎలక్ట్రిసిటీ ఎస్ఈ, డీఎం అండ్ హెచ్ఓ వెంకటరమణ, డీఈవో శ్రీనివాస్, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఓటు నమోదుపై అవగాహన సదస్సు

- అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి
- గ్రామ శాఖ అధ్యక్షుడు పనస శంకర్ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం

**మునగాల, అక్టోబర్ 16 (వుదయం):**



ఉమ్మడి నల్లగొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మునగాల మండలంలోని కలకోవ గ్రామంలో గ్రామ శాఖ అధ్యక్షుడు పనస శంకర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటు నమోదు అవగాహన సదస్సు నిర్వహించారు. మునగాల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తక్కెళ్లపాటి సాయి నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియపై యువతకు, అర్హులైన పట్టభద్రులకు అవగాహన కల్పించారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో కీలకమని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకునేందుకు ముందుకు రావాలని నాయకులు సూచించారు. ఓటు నమోదు ప్రక్రియపై గ్రామస్థులకు వివరించి, అర్హులైన వారందరికీ సమాచారం చేరవేసేందుకు కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోదాడ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్రా నవీన్ రెడ్డి, ఉపసర్పంచ్ అమరబోయిన వీరభద్రం, మండల ప్రధాన కార్యదర్శి పనస విజయ్, కలకోవ గ్రామ శాఖ అధ్యక్షుడు పనస శంకర్, మాజీ సర్పంచ్ చిర్ర శీను, మండవ శ్రీను, యువజన కాంగ్రెస్ మండల నాయకులు రావులపెంట సతీష్, పనస సింహాద్రి, గ్రామ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, బూత్ స్థాయి ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## మహంకాళి యూత్ ఆధ్వర్యంలో దుర్గామాత ఉత్సవాలు

- దుర్గామాత సన్నిధిలో వెయ్యి మందికి అన్నదానం
- అన్నదాతలు కమిటీ సభ్యులు
- బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు పిల్లి రామరాజు యాదవ్



**నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి అక్టోబర్ 16**

నల్లగొండ పట్టణంలో మహంకాళి యూత్ ఆధ్వర్యంలో దుర్గామాత ఉత్సవాల సందర్భంగా భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు వెయ్యి మందికి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. దుర్గామాతను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు అన్నదానంలో పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. సేవాభావంతో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టిన మహంకాళి యూత్ సభ్యులను పలువురు అభినందించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని మహంకాళి యూత్ కమిటీ సభ్యులు సమన్వయంతో నిర్వహించారు. భక్తులు, స్థానికులు కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో పాల్గొన్న కమిటీ సభ్యులు బాగడి రాజన్ బెడ్ సుమిత్ దాసరి అనిల్ బెదా శ్యామ్ రామ్ బాగాడి జోగేందర్ బే యశ్వంత్ కాలనీ ప్రజలు దుర్గామాత భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**సంస్థ కార్యదర్శి బి. బాలమ్మ**

**నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి అక్టోబర్ 16**

నల్లగొండ పట్టణంలో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బతుకమ్మ వేడుకలను మహిళలు, గ్రంథాలయ సిబ్బంది ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి ప్రత్యేక పూజలు చేశారు. బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ సందడి చేశారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని భావితరాలకు తెలియజేయడంలో ఇలాంటి వేడుకలు కీలకపాత్ర పోషిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్. వేణుగోపాలచార్యులు, జిల్లా అధ్యక్షుడు ఎం.ఎస్. శ్రవణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఎం. రాజేష్, లైబ్రేరియన్ ఆర్. కుసుమశ్రీ, బి. శ్రీనివాస్, పి. నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



## దుర్గామాతను దర్శించుకొని పూజలు చేసిన ఎమ్మెల్యే సంజయ్

**కోరుట్ల అక్టోబర్ 16 (వుదయం ప్రతినిధి)**

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కోరుట్ల పట్టణంలో ఏర్పాటు చేసిన దుర్గ మాత మండపాల వద్ద దుర్గ మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన కోరుట్ల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు ఆయా మండపాల నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.



## బతుకమ్మ వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు

- మహిళలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు
- జిల్లెల్లపల్లిలో స్థలాన్ని పరిశీలించిన సర్పంచ్ గడ్డం రాజేశం

**ముత్తారం అక్టోబర్ 16(వుదయం ప్రతినిధి):**

తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేలా జిల్లెల్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాట్లు చేపట్టారు.సద్దుల బతుకమ్మ నిర్వహించే స్థలాన్ని గ్రామ సర్పంచ్ గడ్డం రాజేశం పరిశీలించి,అక్కడ పేరుకుపోయిన పిచ్చి మొక్కలను పంచాయతీ సిబ్బందితో తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు.ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం రాజేశం మాట్లాడుతూ..బతుకమ్మ పండుగను మహిళలు సంతోషంగా,ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్న ఉద్దేశంతో ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.వేడుకలు నిర్వహించే ప్రదేశంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవి,గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## పిఆర్టియుటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా సుంకరి బిక్షం గౌడ్

- ప్రధాన కార్యదర్శిగా బి. మధుసూదన్‌రెడ్డి ఎన్నిక
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బిక్షం గౌడ్ ప్రకటన




**నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి అక్టోబర్ 16**



నల్లగొండ పట్టణంలో పిఆర్టియుటీఎస్ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా సుంకరి బిక్షం గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బి. మధుసూదన్‌రెడ్డి ఎన్నికయ్యారు. నల్లగొండలో జరుగుతున్న సంఘం ఆరో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో భాగంగా రెండో రోజు సుమారు 5 వేల మంది ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన బిక్షం గౌడ్, మధుసూదన్‌రెడ్డితో ఎన్నికల అధికారులు పేరి వెంకట్‌రెడ్డి, గుండు లక్ష్మణ్, మనోహర్‌రావు ప్రమాణ స్వీకారం చేయించారు.

**ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి**

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలోనే 72,457 మంది ఆన్‌లైన్ సభ్యత్వంతో అతిపెద్ద ఉపాధ్యాయ సంఘంగా పిఆర్టియు నిలిచిందన్నారు. నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన బిక్షం గౌడ్, మధుసూదన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాల్సిన గురుతర బాధ్యత నూతన నాయకత్వంపై ఉందన్నారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిఆర్టియు అధికారిక అభ్యర్థిగా సుంకరి బిక్షం గౌడ్ పేరును ప్రకటించారు.

**బిక్షం గౌడ్‌కు పెన్షనర్ల సంఘం మద్దతు**

రాష్ట్ర పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పేరి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగుల ఆరోగ్య కార్డుల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, పీఆర్సీ సాధన కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సుంకరి బిక్షం గౌడ్‌కు రాష్ట్ర పెన్షనర్ల సంఘం తరఫున సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

**సమస్యల పరిష్కారం కోసం పోరాడుతా**

పిఆర్టియుటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన సుంకరి బిక్షం గౌడ్ మాట్లాడుతూ.. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, పట్టభద్రుల సమస్యలను చట్టసభల్లో వినిపించేందుకు ఎమ్మెల్సీ అభ్యర్థిగా ముందుకు వస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగుల సమస్యల పరిష్కారంలో జాప్యం చేసి మూల్యం చెల్లించుకుందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా సమస్యల పరిష్కారంలో మొండిగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గత పదేళ్ల పాలనలో సకాలంలో జీతాలు ఇవ్వకపోవడంతోపాటు ఒక్క ప్రమోషన్ కూడా కల్పించలేదని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా ఒక్క డిమాండ్‌ను పరిష్కరించలేదని ఆరోపించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం 30 ఏళ్లుగా పోరాడిన అనుభవం తనకు ఉందని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, పిఆర్టియు సంఘ అధికార ప్రతినిధి వంగ మహేందర్‌రెడ్డి, జగన్మోహన్ గుప్తా, కోమటిరెడ్డి నరసింహారెడ్డి, ఆడిట్ కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నల్లగొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారాయణరెడ్డి, జానారెడ్డితోపాటు గీత, వాణి, విజయలక్ష్మి , కళావతి, శ్రీవిద్య, జానకి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు. 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు, ప్రాథమిక సభ్యులు హాజరయ్యారు.

## కనకదుర్గ సేవాసమితి అమ్మవారిని దర్శించుకున్న ఎస్ఐ సందీప్

**మల్యాల మండలం అక్టోబర్ 16 ( వుదయం ప్రతినిధి )**



జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రం తూర్పువాడ లోని కనక దుర్గ సేవాసమితి అమ్మవారిని శుక్రవారం ఎస్ఐ సందీప్ దర్శించుకున్నారు.కనక దుర్గ కమిటీ సభ్యులు సాధార స్వాగతం పలికి ఎస్ఐ సందీప్ ని సాలువ తొ సత్కరించి , అనంతరం అర్చకులు అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాన్ని అందజేశారు. 6వ రోజు అమ్మవారు సరస్వతి దేవిగ భక్తులకి దర్శనం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అర్చకులు శివరామ కృష్ణ , కమిటీ సభ్యులు రాయకొండ నరేష్ , ముదాం తిరుపతి , సంగ బాలరాజు , మధుకర్, దీక్ష స్వాములు వంశీ , ప్రసాద్ , రమణ మరియు భక్తులు పాల్గొన్నారు.

## దసరా సెలవుల్లో విద్యార్థులకు వృత్తి నైపుణ్యాల శిక్షణ



**మంథనిలో ఇంటర్న్‌షిప్ చేస్తున్న విద్యార్థులను పరిశీలించిన ప్రిన్సిపాల్ డా. కేసరి సంతోష్‌కుమార్**

**ముత్తారం,అక్టోబర్ 16 (వుదయం ప్రతినిధి):**

విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాలను పెంపొందించి,స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించేందుకు దసరా సెలవుల్లో ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.ఇందులో భాగంగా పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం దరియాపూర్‌లోని మన తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీ విద్యార్థులు మంథనిలో వృత్తి శిక్షణ పొందుతున్నారు.ఇంటర్న్‌షిప్‌లో భాగంగా శిక్షణ పొందుతున్న విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ డా. కేసరి సంతోష్‌కుమార్ సందర్శించి,వారు నేర్చుకుంటున్న నైపుణ్యాలను,శిక్షణ తీరును పరిశీలించారు.విద్యార్థులు ఆసక్తిగా శిక్షణ పొందుతుండటంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు.తరగతి గది విద్యతోపాటు క్షేత్రస్థాయిలో ప్రాయోగిక అనుభవం పొందడం వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు.తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సాధారణ విద్యతోపాటు వృత్తి విద్యా కోర్సులను అందిస్తున్నారు.ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడంతోపాటు భవిష్యత్తులో స్వయం ఉపాధి పొందేందుకు అవసరమైన సామర్థ్యాలను పెంపొందించుకుంటున్నారు.ఈ ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని పాఠశాల వృత్తి విద్యా శిక్షకులు రత్న గోలి, వెంకట్రాజం ఎజ్జు పర్యవేక్షిస్తున్నారు.

# జనాభా గణన- 2027 శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- **జనాభా గణనను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలి**
- **జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

**కామారెడ్డి, అక్టోబర్ 16 (ఉదయం ప్రతినిధి):-**

కామారెడ్డి జిల్లాలో జనాభా గణన– 2027 రెండవ దశకు సంబంధించి సెన్సెస్ ఛార్జ్ క్లర్కులు, సాంకేతిక సహాయకులకు రెండు రోజుల శిక్షణా తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అక్టోబర్ 16, 17 తేదీల్లో నిర్వహిస్తున్న ఈ శిక్షణలో జిల్లాలోని 25 మండలాలు, 4 మున్సిపాలిటీలకు చెందిన సిబ్బంది పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, జనాభా గణన అత్యంత కీలకమైన జాతీయ కార్యక్రమమని, ఇందులో ప్రతి వివరాన్ని ఖచ్చితత్వంతో నమోదు చేయాలని సూచించారు. శిక్షణా తరగతులను సిబ్బంది సద్వినియోగం చేసుకొని, జనాభా గణనకు సంబంధించిన విధివిధానాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సమయంలో నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.

శిక్షణలో భాగంగా జనాభా గణనకు సంబంధించిన 40 రకాల ప్రశ్నలు, వాటి ద్వారా సమాచార సేకరణ విధానం, స్వీయ గణన ప్రక్రియ, సి.ఎం.ఎం.ఎస్. పోర్టల్‌లో చేపట్టాల్సిన సాంకేతిక ప్రక్రియలపై మాస్టర్ ట్రైనర్లు అవగాహన కల్పిస్తున్నారు. క్షేత్రస్థాయిలో సమాచార సేకరణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలను వివరించారు.



ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి రఘునందన్, జిల్లా గణాంకాల అధికారి కార్యాలయానికి చెందిన మాస్టర్ ట్రైనర్లు భుక్య రవి కుమార్, ఏ.ఆర్. యుగంధర్ బాబు, సెన్సెస్ ఛార్జ్ క్లర్కులు, సాంకేతిక సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ

**దండేపల్లి: అక్టోబర్ 16 (ఉదయం విలేకరి )**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలకు రేషన్ బియ్యం పొందేందుకు వీలుగా ప్రవేశపెట్టిన డిజిటల్ రేషన్ కార్డులను శుక్రవారం మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని ద్వారక, ధర్మారావుపేట గ్రామ పంచాయతీల్లో పంపిణీ చేశారు సర్పంచ్ లు మురిమడుగుల సత్యనారాయణ,కొత్త ధర్మయ్య,ఉపసర్పంచ్ కస్తూరి హారిక వెంకటేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు,ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేల కృషి చేస్తామని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలకు రేషన్ బియ్యం అందించేందుకు డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ఈ కార్యక్రమంలో,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్ చంద్,రేషన్ డీలర్ నక్క తిరుపతి,జిపిఒ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సతీష్,తోట సంగీత, గ్రామస్తులు రాస శ్రీనివాస్, మాల్యాల హరీష్,చందు,జోగినపల్లి రామన్న తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల /అక్టోబర్ 16 (ఉదయం ప్రతినిధి)**

ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల ప్రభుత్వ మాత శిశు ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి అందిస్తున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలను, వైద్య పరికరాలు, కార్డులు, రిజిస్టర్లు, వివిధ విభాగాలు, గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలు, చిన్నారుల చికిత్స విభాగం, ఐసియూ గదులను, పడకలు, పిల్లల విభాగంలో ఏసీలు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి ప్రతిరోజూ వచ్చే ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని, గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు నాణ్యమైన వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితి, వారి బరువు, వారికి అందిస్తున్న వైద్య సేవల గురించి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన వైద్య సేవలు అందించే విధంగా వైద్యులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోగులకు వైద్యులు, సిబ్బంది సకాలంలో అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రిలో ఇంకా సదుపాయాలు, వైద్య పరికరాలు, ఏసీలు ఇతరత్రా అవసరం ఉన్నట్లయితే వివరాలతో ప్రతిపాదనలు సమర్పించాలని, మరమ్మతులకు గురైనట్లయితే వెంటనే మరమ్మతులు చేయించాలని, రోగులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. ఆసుపత్రి అధికారులు కోరిన అవసరమైన సదుపాయాలను సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆసుపత్రి ప్రాంగణంలో మద్యం సేవించి వచ్చి గొడవలు సృష్టించే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అటువంటి ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఆసుపత్రిలో ప్రశాంతమైన వాతావరణాన్ని కొనసాగిస్తూ రోగులు, వారి సహాయకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



ఈ కార్యక్రమంలో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు డా. అశోక్ కుమార్, ఆర్ఎంఓ డా. శ్రీధర్, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల చర్యలు

**ఆసిఫాబాద్ ( ఉదయం ప్రతినిధి)**

బెజ్జూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ ను సలుగుపల్లి గ్రామంలో పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ట్రాక్టర్ ట్రాలీలో ఉన్న ఇసుక విలువ సుమారు రూ.2,000 ఉంటుందని అంచనా వేశారు. ఈ ఘటనపై బెజ్జూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు బెజ్జూర్ ఎస్ఐ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా తవ్వడం, రవాణా చేయడం లేదా విక్రయించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతూ పట్టుబడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక వ్యాపారం నిర్వహించేవారు సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందిన తర్వాతే ఇసుక తవ్వకాలు, రవాణా, విక్రయాలు చేపట్టాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై నిరంతరం నిఘా ఉంచి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ సేవలను సద్వినియోగం చేసుకోండి

**సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు**

**ఆసిఫాబాద్ ( ఉదయం ప్రతినిధి )**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో ఈరోజు లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ (రైలు పట్టాలపై ఆసుపత్రి) ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని, ప్రసంగించిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి నుండి నవంబర్ 5వ తేదీ వరకు లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో సేవలు అందించనున్నదని, పట్టణ మరియు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కంటి పరీక్షలు మరియు కంటి ఆపరేషన్లు, చెవి, ముక్కు, గొంతు సంబంధిత ఆపరేషన్లు, పిల్లలకు సంబంధించిన ఎముకల ఆపరేషన్లు, ప్లాస్టిక్ సర్జరీలు ఉచితంగా నిర్వహించబడతాయని తెలిపారు. ఇంపాక్ట్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ సేవల గురించి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని డీఎంహెచ్‌వో సిడం నాగేంద్ర, డీసీహెచ్ఎస్ డా. అవినాష్‌లకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హరిత, సబ్ కలెక్టర్ హర్ష్ చౌదరి, తహసీల్దార్ మల్లెపూల మధుకర్, ఇంపాక్ట్ ఇండియా ఫౌండేషన్ ట్రస్టీ డా. రోహిణి చౌగులే, పెద్ద సంఖ్యలో రోగులు, వారి బంధువులు పాల్గొన్నారు.





## ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పారదర్శకంగా జరగాలి

**కామారెడ్డి, అక్టోబర్ 16 (ఉదయం ప్రతినిధి):-**

సదాశివనగర్ మండలం లింగంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను ప్రభుత్వ నిబంధనల ప్రకారం, పారదర్శకంగా నిర్వహించి నిజమైన అర్హులకు న్యాయం చేయాలని కోరుతూ గ్రామ ప్రజలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. అర్హులైన పేద, ఇల్లు లేని కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, దరఖాస్తుదారుల అర్హతలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, రాజకీయ లేదా వ్యక్తిగత ప్రభావాలకు తావు లేకుండా ఎంపిక చేపట్టాలని కోరారు. అర్హులైన వారికి అన్యాయం జరగకుండా లబ్ధిదారుల జాబితాను పునఃపరిశీలించి, ఫిర్యాదులపై విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పసుపు రాజు, వడ్ల శ్రీనివాస్, అమృత రాజేందర్, చిన్నబీర రవికుమార్, వంగరి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# లైంగిక వేధింపులు, పోక్సో చట్టంపై అవగాహన



**ఆసిఫాబాద్ ( ఉదయం ప్రతినిధి )**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలంలో మానవ అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు, పోక్సో చట్టం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాథోడ్ బిక్కులాల్, స్నిగ్ధ సపోర్ట్ పర్సన్, సరిథా సపోర్ట్ పర్సన్, దినేష్ పీసీతో పాటు భరోసా బృందం సభ్యులు పాల్గొని మానవ అక్రమ రవాణా నివారణ, బాలల రక్షణ, లైంగిక వేధింపుల నుంచి పిల్లలను కాపాడటం, బాధితులకు అందుబాటులో ఉన్న సహాయ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మానవ అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసినప్పుడు 1930 నంబర్‌కు, అలాగే ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైనప్పుడు డయల్ 112కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో బెజ్జూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య, కానిస్టేబుళ్లు మహేందర్, సంజీవ్ పాల్గొన్నారు. బాలల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, అనుమానాస్పద ఘటనలు ఎదురైనప్పుడు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా సూచించారు.

# పంటల కొనుగోలులో పారదర్శకత పాటించాలి

- **రైతులకు మద్దతు ధర అందించాలి**
- **జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్ జిల్లా (ఉదయం ప్రతినిధి)16 అక్టోబర్ 2026**

పంటల కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తూ, రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు పంటలు విక్రయించేందుకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు. శుక్రవారం భైంసా పట్టణంలోని మార్కెట్ యార్డును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంటల కొనుగోలు ప్రక్రియ, తూకం విధానం, రైతులకు కల్పిస్తున్న సదుపాయాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ధాన్యం తూకంలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. రైతులకు నష్టం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం పంటలు విక్రయించేందుకు వచ్చిన రైతులతో కలెక్టర్ మాట్లాడి, కొనుగోలు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కొనుగోళ్లు సజావుగా జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ శశిభూషణ్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# కామారెడ్డి జిల్లా కిసాన్ మోర్చా నూతన కార్యవర్గం నియామకం

**కామారెడ్డి, అక్టోబర్ 16 (ఉదయం ప్రతినిధి):-**

కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణరెడ్డి, బీజేపీ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు నీలం చిన్నరాజులు ఆదేశాల మేరకు బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి కామారెడ్డి జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, పార్టీ సంస్థాగత మార్పులలో భాగంగా కామారెడ్డి జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని, ఈ నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుండి రైతు వ్యతిరేక విధానాలు పాటిస్తు రైతులపై కక్ష్య కట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై రైతులు ఎదుర్కొంటున్న వ్యవసాయ కరెంటు కోతలు, నాణ్యమైన కరెంటు ఇవ్వడకపోవడం వల్ల మోటార్లు, ట్రాన్స్ఫర్మర్లు కాలిపోవడం వల్ల అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రైతన్న కి భరోసా ఇవ్వడం కోసం ఉద్యమాలు చేస్తామని, సమయానికి రైతు బంధు ఇవ్వక పోగా, రైతు బీమా పథకాన్ని ఎత్తి వేసి, కాంగ్రెస్ కి ఓటు వేసిన పాపానికి రైతులను ముప్పు తిప్పలు పెడుతున్న రేవంత్ సర్కార్ ఇప్పుడు యాసంగి పంట వేయొద్దు అని చెప్పడం విడ్డూరం అని బీజేపీ పక్షాన రైతుల సమస్యలపై ఉద్యమాల కార్యాచరణ చేస్తామని అన్నారు.



## కరెంట్ కోతలతో రైతులకు అవస్థలు

**ఎమ్మెల్యే కోవ. లక్ష్మి**

**ఆసిఫాబాద్ ( ఉదయం ప్రతినిధి )**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కోతలతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి విమర్శించారు. పంట చేతికొచ్చే సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలతో మోటార్లు కాలిపోతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్లు పేలుతున్నాయని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణకు కీలకమైన సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసి ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లే ప్రయత్నాలు సరికాదని అన్నారు. విద్యుత్ కోతలతో ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు అధికారులను బాధ్యులను చేయడం తగదని పేర్కొంటూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, కాలిపోయిన మోటార్లకు, పంట నష్టాలకు పరిహారం అందించాలని, సింగరేణి ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని, విద్యుత్ కోతలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని కోవా లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆకాష్, కౌన్సిలర్లు చిలువేరు వెంకన్న ,నాగబాబు ,లక్ష్మి టిఆర్ఎస్ నాయకురాలు మరుసుకోల సరస్వతి, పార్టీ అధ్యక్షులు రవీందర్, నాయకులు సాయి ,శ్రావణ్ శ్రీనివాస్ ,వినోద్ ఉన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో బతుకమ్మ సంబరాలు

**ఆసిఫాబాద్ ( ఉదయం ప్రతినిధి )**

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో శుక్రవారం వైద్య సిబ్బంది బతకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల రంగురంగుల పూలతో బతకమ్మలను తయారు చేసి గౌరమ్మకు సంప్రదాయ బద్దంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బతుకమ్మ డీజే ఆట పాటలతో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, సూపర్వైజర్ ,స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ,వైద్య సిబ్బంది, మహిళలు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలు లేవు

**ఎస్ఈ జాడే ఉత్తమ్**

**ఆసిఫాబాద్ ( ఉదయం ప్రతినిధి )**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలం కృష్ణపల్లి గ్రామంలో వ్యవసాయ విద్యుత్ సరఫరాపై విద్యుత్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బెజ్జూర్ సెక్షన్ పరిధిలోని కుశనపల్లి గ్రామంలో వరి పొలాలను ఎస్ఈ ఆపరేషన్స్ జాడే ఉత్తమ్ సందర్శించి, రైతులతో వ్యవసాయ విద్యుత్ (AGL) సరఫరా పరిస్థితిపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సాగుకు అవసరమైన నీరు సమృద్ధిగా అందుబాటులో ఉందని, విద్యుత్ సరఫరా పరంగా ఎలాంటి సమస్యలు లేవని అధికారులు గుర్తించడం జరిగిందన్నారు . టాంగ్ టెస్టర్ ద్వారా విద్యుత్ లోడ్‌ను పరిశీలించి, వోల్టేజీలను తనిఖీ చేయగా అవి సంతృప్తికరంగా ఉన్నట్లు నిర్ధారించామన్నారు. ప్రస్తుతం అందుతున్న వ్యవసాయ విద్యుత్ సరఫరాపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారని, రైతులకు నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డి. ఈ సిర్పూర్ కాగజ్ నగర్ ఏఈలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బిచ్కుంద మున్సిపాలిటీలో నూతన బార్ కేటాయింపునకు లక్కీ డ్రా

**కామారెడ్డి, అక్టోబర్ 16 (ఉదయం ప్రతినిధి):-**

కామారెడ్డి జిల్లాలోని బిచ్కుంద మున్సిపాలిటీలో నూతన బార్ కేటాయింపునకు సంబంధించి శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించారు. నూతన బార్ కేటాయింపునకు మొత్తం 90 దరఖాస్తులు అందినట్లు జిల్లా ఆబ్కారీ అధికారి బి. ముకుందరెడ్డి తెలిపారు. లక్కీ డ్రా ద్వారా ఎల్లారెడ్డికి చెందిన అతినారపు భైరవ స్వామి విజేతగా నిలిచినట్లు పేర్కొన్నారు. లక్కీ డ్రాలో టోకెన్ నంబర్ 1కు బార్ కేటాయింపు లభించినట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో పారదర్శకంగా నిర్వహించినట్లు జిల్లా ఆబ్కారీ అధికారి తెలిపారు.




# శ్రీ సరస్వతి దేవి అలంకారంలో అమ్మ వారిని పూజించిన మున్సిపల్ చైర్ పర్సన్

**కామారెడ్డి, అక్టోబర్ 16 (ఉదయం ప్రతినిధి):-**

జిల్లా కేంద్రంలోని వైద్యనాత్ కాలనీలో శ్రీ సింహాసనేశ్వరి దుర్గ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గమాత అమ్మ వారిని ఆరవ రోజైన శుక్రవారం శ్రీ సరస్వతి మాతా అవతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేసి దూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మ వారిని కాలనీవాసులందరూ కలిసి పూజించుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింహాసనేశ్వరి దుర్గామాత ఉత్సవ సమితి సభ్యులు, సుధీర్ రెడ్డి, కృష్ణ రెడ్డి, విష్ణు, లక్ష్మణ్, కాలనీ వాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





## ఫిట్నెస్ కోసం సాధన చేయాలి

**దండేపల్లి ఎస్ఐ రాజవర్ధన్**

**దండేపల్లి: అక్టోబర్ 16 (ఉదయం విలేకరి)**

ఇండియన్ ఆర్మీ ఉద్యోగం కోసం రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి దేహదారుఢ్య పరీక్షలకు సిద్ధం అవుతున్న అభ్యర్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు దండేపల్లి ఎస్ఐ రాజవర్ధన్. అమ్మ ఫౌండేషన్ మరియు మార్నింగ్ వాకర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షలకు దండేపల్లి మండలానికి చెందిన సెలవుపై వచ్చిన ఆర్మీ జవాన్ల సహకారంతో పరీక్షలు నిర్వహించారు దీనికి 70 మంది అభ్యర్థులు హాజరు కాగా 55 మంది ఫిట్నెస్ గా ఉన్నట్లు తెలిపారు ఫిట్నెస్ లేనివారు సాధన చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఆర్మీ జవాన్లు అల్లంల నరేష్,కట్ల తిరుపతి, అభిరామ్,గోపాల్,లక్ష్మణ్, రాజేష్,శ్రావణ్ కుమార్, మహేందర్,ప్రమోద్, వెంకటేష్,సాయి,అమ్మ ఫౌండేషన్,మార్నింగ్ వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

# గిరిజనుల అభివృద్ధికి అటవీ శాఖ సహకారం



**డీఎఫ్ఓ బాలమణి**

**ఆసిఫాబాద్, అక్టోబర్ 15 (ఉదయం ప్రతినిధి )**

గిరిజనుల అభివృద్ధి, అటవీ సంరక్షణకు గిరిజన సంఘాలతో సమన్వయంతో పనిచేస్తామని జిల్లా అటవీ అధికారి సీహెచ్. బాలమణి తెలిపారు. గురువారం గోండ్వానా పంచాయతీ రాయి సెంటర్ ప్రతినిధులు, వివిధ గిరిజన సంఘాల నాయకులతో ఆమె సమావేశమయ్యారు.ఈ సందర్భంగా గిరిజన పండుగల నిర్వహణ, అటవీ వనరుల వినియోగం, అటవీ హక్కుల పరిరక్షణ, గిరిజన గ్రామాల అభివృద్ధిపై చర్చించారు. జిల్లాలో ఎకో టూరిజం అభివృద్ధి, బొటానికల్ గార్డెన్ ఏర్పాటు, ప్రత్యేక బలహీన గిరిజన సమూహాల (పీవీటీజీ) గ్రామాల్లో రహదారి సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తామని డీఎఫ్ఓ పేర్కొన్నారు.దసరా, దీపావళి వంటి పండుగల సందర్భంగా సంప్రదాయ ఆచారాల కోసం అటవీ ఉత్పత్తులు, కలప వినియోగించే సమయంలో స్థానిక అటవీ అధికారులను సంప్రదించి చట్ట నిబంధనలను పాటించాలని సూచించారు. అటవీ సంరక్షణలో గిరిజనుల పాత్ర కీలకమని అటవీశాఖ తో పరస్పర సమన్వయంతో కలిసి పనిచేస్తే అడవులు అటవీ సంపద భవిష్యత్ తరాలకు అందించవచ్చు అన్నారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్ ఎస్డిఓ డాక్టర్ అప్పయ్య ,మాజీ ఐటీడీఏ చైర్మన్ అర్జున్ ,రాష్ట్ర అధ్యక్షులు ఆత్రం భీమ్రావు, గుణవంతరావు ,సంఘాల నాయకులు సర్పంచులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

**అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్**

**ఆసిఫాబాద్, ( ఉదయం ప్రతినిధి)**

జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను సమన్వయంతో త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ, వీఓ భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. మూత్రశాలలు లేని అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని, అంగన్‌వాడీలు, ఆశ్రమ పాఠశాలల్లో ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. అటవీ భూముల సమస్యలున్న చోట ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించి, పెండింగ్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# వేములవాడ పట్టణంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

- మున్సిపల్ కార్యాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- మున్సిపల్ కార్యాలయం నుండి బతుకమ్మ తెప్ప వరకు స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ అమ్మవారిని తీసుకెళ్లిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- హాజరైన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కౌన్సిలర్లు



**రాజన్న సిరిసిల్ల జిల్లా (వుదయం ప్రతినిధి)**

వేములవాడలో బతుకమ్మ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. మున్సిపల్ ఆధ్వర్యంలో సుమారు రూ.34 లక్షలతో బతుకమ్మ పండుగకు అవసరమైన ఏర్పాట్లు. మూలవాగు వద్ద నిర్మించిన బతుకమ్మ తెప్ప దగ్గర బతుకమ్మ ప్రతిమ ప్రతిష్ఠించడం ఆనవాయితీగా వస్తుంది.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక. ప్రకృతిని ఆరాధించే గొప్ప పండుగ బతుకమ్మ. వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి గౌరమ్మను పూజించడం మన సంస్కృతిలో ప్రత్యేకత దక్షిణ కాశీ వేములవాడలో బతుకమ్మ పండుగకు ప్రత్యేక విశిష్టమైన సంప్రదాయం ఉంది. ఇతర ప్రాంతాల్లో తొమ్మిది, పదకొండు రోజులు బతుకమ్మ వేడుకలు జరుగుతుండగా వేములవాడలో ఏడు రోజులకే నిమజ్జనం జరగడం ప్రత్యేకత. వేములవాడ ఆడబిడ్డలకు పుట్టింటితోపాటు మెట్టినింటి ప్రాంతాల్లోనూ బతుకమ్మ వేడుకల్లో పాల్గొనే అవకాశం. పట్టణంలోని వార్డుల మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశాం. విద్యుత్ దీపాలు, పారిశుధ్యం, ఇతర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగింది.. గత పది రోజులుగా మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణ మహిళలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు.

# కలెక్టరేట్‌లో ఘనంగా ఏడో రోజు బతుకమ్మ సంబరాలు





**మహబూబ్‌నగర్, వుదయం ప్రతినిధి**

మహబూబ్‌నగర్ కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఏడో రోజు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డితో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొని వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమం, మైనారిటీ సంక్షేమం, గిరిజన సంక్షేమం, రెవెన్యూ, కార్మిక, పరిశ్రమలు, షెడ్యూల్డ్ కులాల సహకార శాఖలకు చెందిన మహిళా ఉద్యోగినులు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటలాడుతూ సందడి చేశారు. మహిళల ఆటపాటలతో కలెక్టరేట్ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళా ఉద్యోగినులు సంప్రదాయ బద్ధంగా, ఉత్సాహంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజించే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానంలో ప్రత్యేక స్థానం కలిగి ఉందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులకు తన తరపున, తన కుటుంబం తరపున, కలెక్టరేట్ తరపున బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, వివిధ శాఖల జిల్లా అధికారులు, మహిళా ఉద్యోగినులు తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వేను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలి

**లైసెన్స్డ్ సర్వేయర్లకు కిట్లు పంపిణీ చేసిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి అక్టోబర్ 16**

భూముల రీ సర్వే కార్యక్రమాన్ని పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను, లైసెన్స్డ్ సర్వేయర్లను ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారానికి, భూ రికార్డుల ప్రక్షాళనకు రీ సర్వే ఎంతగానో దోహదపడుతుందని ఆమె పేర్కొన్నారు. శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో డిప్యూటీ తహసీల్దార్లు, లైసెన్స్డ్ సర్వేయర్లు, గ్రామ పాలన అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. భూముల రీ సర్వే ఒక చారిత్రాత్మక మార్పు అని, ఈ ప్రక్రియ ద్వారా భూ రికార్డులను క్రమబద్ధీకరించడంతో పాటు భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమవుతుందని తెలిపారు.

**70 గ్రామాల్లో రీ సర్వే**

వరంగల్ జిల్లాలో రీ సర్వే నిర్వహణ కోసం మొత్తం 70 గ్రామాలను ఎంపిక చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఇప్పటివరకు 21 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించగా, వాటిలో ఎనిమిది గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ పూర్తయినట్లు వివరించారు. మరో ఆరు గ్రామాల్లో 9(2) నోటీసులు జారీ చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రీ సర్వే పనులను వేగవంతంగా, సమర్థవంతంగా పూర్తి చేసేందుకు ప్రతి మండలానికి రెండు బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ బృందాల్లో డిప్యూటీ తహసీల్దార్లు, లైసెన్స్డ్ సర్వేయర్లు, గ్రామ పాలన అధికారులు సభ్యులుగా ఉంటారని వివరించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

**సర్వేయర్లకు 12 రకాల వస్తువులతో కిట్ల పంపిణీ**

శిక్షణ కార్యక్రమంలో భాగంగా లైసెన్స్డ్ సర్వేయర్లకు కలెక్టర్ పలు అవసరమైన వస్తువులతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. మెడికల్ కిట్, గొడుగు, ప్యాడ్ తదితర 12 రకాల వస్తువులతో కూడిన బ్యాగులను అందజేశారు. రీ సర్వే పనులు నిర్వహించే సమయంలో ఈ వస్తువులు ఉపయోగపడతాయని తెలిపారు. సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయిలో కృషి చేస్తూ, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. భూ రికార్డుల విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి , ఏడీ సర్వే అండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాసులు, లీడ్ బ్యాంక్ మేనేజర్ జీవన్, డిప్యూటీ తహసీల్దార్లు, లైసెన్స్డ్ సర్వేయర్లు, గ్రామ పాలన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలి

**దోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ డాక్టర్ రాచందర్ నాయక్**



**నర్సింహులపేట అక్టోబర్ 16 ఉదయం ప్రతినిధి**

వరంగల్,ఖమ్మం,నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని ప్రభుత్వ విప్, దోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచందర్ నాయక్ పిలుపునిచ్చారు.నర్సింహులపేట మండల కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, పార్టీశ్రేణుల బాధ్యతలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. పట్టభద్రుల ఓటర్లను కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బ సోమిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసోజు రాజశేఖర్, మాజీ మండల అధ్యక్షుడు జీనకల రమేష్, సమన్వయ కమిటీ అధ్యక్షుడు దస్రునాయక్, సర్పంచులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, యువజన విభాగం నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నిరుపేదల సొంతింటి కల సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు!



**నారక్కపేటలో నూతన గృహప్రవేశానికి హాజరైన కాంగ్రెస్ నాయకులు**

**నల్లబెల్లి, అక్టోబర్ 16 (వుదయం ప్రతినిధి):**

నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని నల్లబెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మలోత్ చరణ్ సింగ్ అన్నారు. నారక్కపేట గ్రామానికి చెందిన లాసాని ఉమ–రవి నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన హాజరై, రిబ్బన్ కట్ చేసి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చరణ్ సింగ్ మాట్లాడుతూ, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో తొలి విడతలో ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. రెండో విడతలోనూ అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్లూరి రమేష్, గ్రామ వర్కింగ్ ప్రెసిడెంట్ పోగుల కుమారస్వామి, మండల బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కుంచాల రాజు, గ్రామ పార్టీ ఉపాధ్యక్షులు గజ్జి క్రాంతి, శ్రీపతి కుమారస్వామి, వారికల శ్రీను, కార్యదర్శులు రాయాసబ్, దిడ్డి అశోక్, వార్డు సభ్యుడు మేయర్ల శివ, భుంపెల్లి శ్రీను, గ్రామ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు హస్సన్, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు అజ్మీర శోభన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తిప్పని చేరాలు, బీసీ సెల్ అధ్యక్షుడు అడిక్కి చర్ల శ్రీను, కదరిక మల్లయ్య, మాటిక నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# బతుకమ్మ చెరువులను సందర్శించిన గొర్రె కిరణ్ కుమార్

**హసన్‌పర్తి, అక్టోబర్16 (వుదయం ప్రతినిధి):**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ పరిధిలోని హసన్‌పర్తి 66వ డివిజన్ లో బతుకమ్మ ఆట స్థలాలను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొర్రె కిరణ్ కుమార్ అధికారులతో కలిసి బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా హసన్‌పర్తిలోని పెద్ద చెరువు బతుకమ్మ ఆటస్థలం, లైటింగ్ ఏర్పాట్లు, గుంతలమయంగా ఉన్న రోడ్డు, చెట్ల పొదలు, తొలగించారు. అదేవిధంగా చెన్నంగి చెరువు కట్టను . సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా హసన్‌పర్తి ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బతుకమ్మ ఆడుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, బతుకమ్మ ఆటస్థలంలో పరిశుభ్రత, తగినంత వెలుతురు, రహదారుల సౌకర్యం తదితర అంశాలను పరిశీలించి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# సీతంపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా చీర తిరుపతి

**హసన్ పర్తి అక్టోబర్16 (వుదయం ప్రతినిధి):**



మండల పరిధిలోని సీతంపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా చీర తిరుపతి నడిపి నియమితులయ్యారు. ఈ సందర్భంగా చీర తిరుపతి మాట్లాడుతూ.., తను పార్టీకి చేసిన సేవలను గుర్తించి తనకు అధ్యక్ష పదవి లభించిందని, కష్టానికి ఫలితం దక్కిందని అన్నారు. అలాగే పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, ప్రజా ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరేలా పని చేస్తానని అన్నారు. తమను గ్రామ పార్టీ అధ్యక్షులుగా నియమించినదుకు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, డీసీసీ అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రేణుకుంట్ల అశోక్, తోకల లక్ష్మారెడ్డి, పార్టీ నాయకులకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



# కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చెగొండ ప్రభాకర్‌కు ఘన నివాళి!

**రాయపర్తి, అక్టోబర్ 16 (వుదయం ప్రతినిధి):**

రాయపర్తి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చెగొండ ప్రభాకర్ అనారోగ్యంతో మృతి చెందడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం ప్రభాకర్ పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.రాయపర్తి మండల కేంద్రానికి చెందిన ప్రభాకర్, రాయపర్తి టౌన్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చెగొండ సాయికుమార్ తండ్రి. ఆయన మృతి పట్ల కాంగ్రెస్ నాయకులు సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్య నాయక్, ఏఎంసీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, స్థానిక సర్పంచ్ గారె సహేంద్ర బిక్షపతి, ఉపసర్పంచ్ మచ్చ రమేష్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పెండ్లి మహేందర్ రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మెర కళ్యాణ్ గౌడ్, మచ్చ నర్సయ్య, ఎండీ అఫ్రోజ్, కోతి వీరయ్య, ఎండీ మహమూద్, ఎనగందుల మురళి, కుంట రాజు, కుంట సాయిలు, గూగులోత్ స్వప్న విజయ్ నాయక్, ఎండీ రియాజ్, ప్రవీణ్, ప్రశాంత్, ఫెరోజ్ తదితర మండల ముఖ్య నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

# చేతి పంపు రిపేర్ చేయించిన సర్పంచ్ తిరుపతి

**పర్వతగిరి, అక్టోబర్ 16 ( వుదయం ప్రతినిధి ):**



పర్వతగిరి మండలం పరిధిలోని దూప తండ గ్రామపంచాయతీలో ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించి అందరి ప్రశ ంస లు అ ందుకుంటున్నారు. గ్రామంలో తాగునీటి సరఫరా అందించే చేతి పంపు అకస్మాత్తుగా మొరాయించడంతో, స్థానికులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యను గుర్తించిన వెంటనే స్థానిక సర్పంచ్, ఉప సర్పంచ్ మరియు వార్డ్ మెంబర్లు ఏమాత్రం కాలయాపన చేయకుండా హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. తమ సమక్షంలోనే మెకానిక్‌లను పిలిపించి, చేతి పంపు మరమ్మతు పనులను వేగవంతంగా పూర్తి చేయించారు. సమస్య చిన్నదైనా,పెద్దదైనా ప్రజల ఇబ్బందిని క్షణాల్లో పరిష్కరించడమే తమ కర్తవ్యమని వారు మరోసారి నిరూపించారు. స్పాట్‌లోనే పనుల పర్యవేక్షణ. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ అభివృద్ధి బాటలో నడిపిస్తున్న ఇలాంటి ప్రజాప్రతినిధులు ఉండటం మా అదృష్టమని గ్రామస్థులు కొనియాడారు.

# కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్‌నగర్ , వుదయం ప్రతినిధి**

మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ సమీపంలోని శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానంలో నవంబర్ 10 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని దేవరకద్ర శాసనసభ్యులు జి. మధుసూదన్ రెడ్డి సూచించారు. శుక్రవారం సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి ఆయన బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణకు సంబంధించి వివిధ శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 24 గంటల పాటు వైద్య సేవలు అందించేలా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, అవసరమైన మందులు, అంబులెన్సులు అందుబాటులో ఉంచాలని సూచించారు. అవసరమైన నిధుల విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. జాతర రోజుల్లో, ముఖ్యంగా నవంబర్ 16 న ఉద్దాల ఉత్సవం సందర్భంగా భక్తుల రద్దీకి అనుగుణంగా అన్ని మార్గాల్లో ఆర్టీసీ బస్సులు నడపాలని, వాహనాల పార్కింగ్‌కు ముందస్తు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. విద్యుత్ శాఖ నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య నిర్వహణకు అదనపు సిబ్బందిని నియమించాలని, తగిన సంఖ్యలో మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్సైజ్ శాఖ అధికారులు బెల్ట్ షాపులు, మద్యం విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భవిష్యత్తులో శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. భక్తుల సౌకర్యార్థం కాటేజీలు, కల్యాణ మండపం తదితర వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణలో ప్రతి శాఖ అధికారి బాధ్యతాయుతంగా పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, గత సంవత్సరం అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది కూడా బ్రహ్మోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. భక్తులకు తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్లు, రవాణా, వాహనాల పార్కింగ్ తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. జాతర ప్రాంగణంలో వివిధ శాఖల సమన్వయం కోసం ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, భక్తులకు అవసరమైన సమాచారం అందేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో నిరంతర తాగునీటి సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్లు, షవర్ల ఏర్పాటు చేపట్టాలని, అవసరమైతే ముఖ్యమైన రోజుల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రత్యామ్నాయంగా జనరేటర్లను సిద్ధంగా ఉంచాలన్నారు. పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో పారిశుధ్య నిర్వహణకు తగినంత మంది సిబ్బందిని నియమించాలని, పోలీసు శాఖ బందోబస్తు, శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆర్అండ్‌బీ శాఖ బారికేడింగ్, రహదారుల మరమ్మతులు చేపట్టాలని, ఎక్సైజ్ శాఖ బెల్ట్ షాపులు, మద్యం విక్రయాలు జరగకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆర్టీసీ అధికారులు భక్తుల రద్దీకి అనుగుణంగా తగినన్ని బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి శాఖ అధికారి తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం, జిల్లా రెవెన్యూ అధికారి ఏ. నిర్మల, శ్రీ కురుమూర్తి స్వామి దేవాలయ చైర్మన్ బత్తుల బాలరాజు, ఆర్డీవో నవీన్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, దేవాలయ ఈవో మదన్ రెడ్డి, జిల్లా అధికారులు, చిన్నచింతకుంట మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాల్లో జన్నపురెడ్డి శ్రీరామ్ రెడ్డి!

**భక్తిశ్రద్ధలతో అమ్మవారి సేవలో పాల్గొని..**
**మహా అన్నదాన కార్యక్రమంలో భాగస్వామ్యం**



**రాయపర్తి అక్టోబర్ 16 (వుదయం ప్రతినిధి):**

శ్రీ దుర్గా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. మండలం గన్నారం గ్రామంలో శ్రీ దుర్గా దేవి శరన్నవ ఉత్సవాల్లో డాక్టర్ జన్నపు రెడ్డి శ్రీరామ్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలనిఆకాంక్షించారు.ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్న ప్రసాదం అందించే కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యారు.దైవభక్తితో పాటు సేవాభావం, ఆధ్యాత్మికతను పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను చాటుతాయని పేర్కొన్నారు.శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించడంతో పాటు, సేవా కార్యక్రమాల ద్వారా మానవత్వాన్ని చాటుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గడ్డం విజయ సమ్మయ్య, అధ్యక్షులు కరుణాకర్, రాజు, సోమిరెడ్డి, బొందాలు,సుధాకర్, ప్రభాకర్ యాదగిరి పాల్గొన్నారు.

# రామకృష్ణాపూర్‌లో భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి పూజలు

**మంచిర్యాల /రామకృష్ణాపూర్/అక్టోబర్ 16(వుదయం ప్రతినిధి)**



రామకృష్ణాపూర్ పట్టణంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శుక్రవారం అమ్మవారు కాత్యాయనీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని సూపరబజ ార కూడలి, బిజోన్ సెంటర్, రాజీవ్ చౌక్‌లో ఫోర్ వీలర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.సూపర్‌బజార్ కూడలిలోని అమ్మవారి మండపం వద్ద మందమర్రి తహసీల్దార్ సతీష్‌కుమార్ దంపతులు భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజీవ్ చౌక్‌లో ఫోర్ వీలర్స్ వాహనదారుల సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మున్సిపల్ చైర్పర్సన్ గొడిసెల సంధ్యారాణి–రాజారమేష్, వైస్ చైర్మన్ మిట్టపల్లి సరిత–శ్రీనివాస్ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఈనెల 18న బతుకమ్మల కోసం ఏర్పాటుచేసిన లైటింగ్ పరిశీలించిన వార్డు సభ్యుడు విజయ్

**ఖానాపురం, అక్టోబర్ 16 (వుదయం ప్రతినిధి):**



ఈనెల 18న ఆదివారం నిర్వహించే మహిళలకు అత్యంత ఇష్టమైన సద్దుల బతుకమ్మను తుంగబంధం కాలువ వద్ద మహిళా సోదరీమణులు ఆడుకోవడానికి ప్లేస్ ను చదును చేసి ఊరు చివర నుండి తుంగబంధం కాలువ వరకు ఎన్ హెచ్ 365 జాతీయ రహదారికి ఇరువైపులా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో విద్యుత్ లైటింగ్ ఏర్పాట్లను గ్రామ సర్పంచ్ సర్పంచ్ల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్ ఆదేశాల మేరకు వార్డు సభ్యుడు గుండ్లపల్లి విజయ్ విద్యుత్ లైటింగ్ ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం పరిశీలించినట్లు వార్డు సభ్యుడు తెలిపారు. ఊరు చివర నుండి తుంగబంధం కాలువ వరకు విద్యుత్ లైట్లతో జాతీయ రహదారి కళకళలాడుతుంది. రహదారి వెంట వెళ్లే వాహనదారులు గ్రామ మహిళలు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వార్డు సభ్యునితోపాటు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యుడు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడికి కొండంత అండ

**2.50 లక్షల ఎల్ వో సి అందజేసిన అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సింగారపు రమేష్**

**పర్వతగిరి, అక్టోబర్ 16 ( వుదయం ప్రతినిధి ):**



అపదలో ఉన్న పేద కుటుంబానికి అంబేడ్కర్ యువజన సంఘం కొండంత అండగా నిలిచింది. పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన మేడిశెట్టి పరమేశ్ తీవ్ర అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్నారు.బాధితుడి వైద్య ఖర్చుల నిమిత్తం పర్వతగిరి పట్టణ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సింగారపు రమేష్ ప్రత్యేక చొరవ తీసుకుని, తక్షణ సహాయం కింద రెండున్నర లక్షల రూపాయల విలువైన ఎల్‌వోసీ ని శుక్రవారం నాడు బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సింగారపు రమేష్ మాట్లాడుతూ..ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ సహాయం చేయడమే తమ సంఘం యొక్క ముఖ్య ఉద్దేశమని అన్నారు. పరమేశ్ త్వరగా కోలుకుని పరిపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి తిరిగి రావాలని ఆకాంక్షించారు. బాధితుడి కుటుంబానికి భవిష్యత్తులో కూడా ఏ అవసరం వచ్చినా అంబేడ్కర్ యువజన సంఘం ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని హామీ ఇచ్చారు.అత్యవసర సమయంలో స్పందించి 2.50 లక్షల ఎల్‌వోసీ అందించి ఆదుకున్నందుకు మేడిశెట్టి పరమేశ్ కుటుంబ సభ్యులు మరియు గ్రామస్తులు, పర్వతగిరి పట్టణ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సింగారపు రమేష్‌తో పాటు సంఘ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు, గ్రామ ముఖ్యులు మరియు స్థానిక యువకులు పాల్గొన్నారు.

ఉదయం



# గురుకుల పాఠశాలలో వసతులపై ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సమీక్ష

- విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి
- ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్

**జగిత్యాల అక్టోబర్ 16 (ఉదయం ప్రతినిధి)**



జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగిత్యాల నియోజకవర్గంలోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సంక్షేమ శాఖల పరిధిలోని గురుకుల పాఠశాలలు కళాశాలల్లో విద్యార్థులకు అందుతున్న వసతులు.హాస్టళ్లలో నెలకొన్న సమస్యలపై జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా నియోజకవర్గంలోని గురుకుల పాఠశాలలు కళాశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు హాస్టళ్లలో ఉన్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు పాఠశాలలు పునఃప్రారంభం అయ్యే సమయానికి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన వసతులను కల్పించేందుకు అధికారులు సిబ్బంది చొరవ చూపాలని ఎమ్మెల్యే సూచించారు విద్యార్థులకు మంజూరైన పుస్తకాలు యూనిఫామ్ తో పాటు ఇతర అవసరమైన సామాగ్రి విషయాలను కూడా అడిగి తెలుసుకున్నారు ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని గురుకుల పాఠశాలలు కళాశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ సూచించారు ఈ సమావేశంలో బీసీ ఎస్సీ వెల్ఫేర్ అధికారి జయరాజ్ జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి కెవై ప్రసాద్ జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి నరేశ్ బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ గురుకుల పాఠశాలలు కళాశాలల ప్రధానోపాధ్యాయులు ప్రిన్సిపాళ్లు హాస్టల్ వార్డెన్లు గురుకుల పాఠశాలలు కళాశాలల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రామగుండంలో అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- జనవరి 15 నాటికి నూతన ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి
- నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులను ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాలి
- జీవో 76 దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన అక్టోబర్ 25లోగా పూర్తి చేయాలి
- ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలి
- విద్యాసంస్థల్లో అదనపు తరగతి గదుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి
- పలు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్

**రామగుండం, 2026 16 (ఉదయం ప్రతినిధి)**



రామగుండం నగరంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష రామగుండం నగరంలో విస్తృతంగా పర్యటించారు. రామగుండం–లింగాపూర్ రహదారి నిర్మాణ పనులు, రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో నూతన ఆసుపత్రి భవన నిర్మాణ పనులు, నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నిర్వహణ, 36వ డివిజన్‌లో జరుగుతున్న జీవో 76 దరఖాస్తుల ధ్రువీకరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అలాగే రామగుండం ప్రభుత్వ జూనియర్ కళాశాల, శారదానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల పనులను, మంథని మండలం చిల్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, రామగుండం–లింగాపూర్ రహదారి నిర్మాణ పనులకు ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, నీటి పైపులైన్లను త్వరితగతిన మార్చేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాల మార్పిడి, పైపులైన్ల తరలింపు పనులను వెంటనే చేపట్టి, రహదారి నిర్మాణ పనులు వేగంగా కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మిస్తున్న నూతన ఆసుపత్రి భవన పనులను పరిశీలించిన కలెక్టర్, నిర్మాణ పనులను వేగవంతం చేసి జనవరి 15 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నూతన ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించే దిశగా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మిస్తున్న నర్సింగ్ కళాశాల భవన పనులను పరిశీలించి, నిర్మాణ పనుల్లో వేగం పెంచి ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన వనరులను సమకూర్చుకొని పనులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రామగుండం 36వ డివిజన్‌లో జరుగుతున్న జీవో 76 దరఖాస్తుల ధ్రువీకరణ ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దరఖాస్తుల సంఖ్యను క్షేత్రస్థాయిలో ధ్రువీకరించడంతో పాటు, సంబంధిత భూములు సింగరేణి సంస్థకు చెందినవా లేదా అనే అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. రామగుండం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, శారదానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల పనులను పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో చేపడుతున్న మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అదనపు తరగతి గదుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని, నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. మంథని మండలం చిల్లపల్లి గ్రామంలో గౌతమి మహిళా సమాఖ్య, రామగిరి మహిళా సమాఖ్యల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒక మెగావాట్ సామర్థ్యం గల సోలార్ ప్లాంట్‌ను పరిశీలించారు. ప్రస్తుతం ప్లాంట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని, రోజుకు 6,000 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు వివరించారు. అయితే ప్రత్యేక విద్యుత్ లైన్ అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుతం రోజుకు సుమారు 4,500 యూనిట్ల విద్యుత్‌ను గుంజపడుగు సబ్‌స్టేషన్‌కు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటుకు సుమారు రూ.28 లక్షల అంచనా వ్యయం అవసరమవుతుందని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటుతో సోలార్ ప్లాంట్ ద్వారా విద్యుత్ సరఫరా సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ పర్యటనలో TGMSIDC అధికారి విశ్వప్రసాద్,TGEWIDC ఏఈ రమేష్, ఈఈ రామకృష్ణ, అదనపు డీఆర్డీఏ అధికారి రవీందర్, డీఈ ప్రభాకర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమమే లక్ష్యం



**డా. కావటి సతీష్ యాదవ్**

**మంథని, అక్టోబర్ 16:ఉదయం ప్రతినిధి**

తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర చైర్మన్ డా. పిడమర్తి రవి ఆదేశాల మేరకు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి డా. కావటి సతీష్‌యాదవ్ ఆధ్వర్యంలో మంథని మండల కమిటీని ప్రకటించారు. శుక్రవారం మంథని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యమకారుడికి గుర్తింపు, గౌరవం, సంక్షేమ ఫలాలు అందించడమే కమిటీ లక్ష్యమని తెలిపారు. ఉద్యమకారుల గుర్తింపు కోసం డా. పిడమర్తి రవి నేతృత్వంలో ఏళ్లుగా పోరాడుతున్నామని, కాంగ్రెస్ మేనిఫెస్టోలో హామీ మేరకు సీఎం రేవంత్ రెడ్డి కేకే కమిటీ వేసి ఆన్‌లైన్ దరఖాస్తుకు జీవో జారీ చేయడాన్ని స్వాగతిస్తున్నామని, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉద్యమకారులంతా తమ ఫొటోలు, పేపర్ కటింగులు, ఆధారాలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మంథని మండల కమిటీని ఆయన ప్రకటించారు

అధ్యక్షులుగా మిర్యాల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శులు సాదుల శ్రీనివాస్, కోరవేన కుమార్, ఉపాధ్యక్షులు ముస్కె ఈశ్వరమ్మ, జిమ్మడ కొండయ్య, అరెల్లి సురేందర్, కార్యదర్శులు ఆకుల అరుణ్, కాసిపేట మల్లేష్, సంయుక్త కార్యదర్శులు అక్కపాక లక్ష్మి, ముత్తినేని నరేష్, ప్రచార కార్యదర్శులు కట్టెకోళ్ల విజయ్, దాడి శ్రీనివాస్, కోశాధికారి చిదురాల మధుకర్ రెడ్డి, మీడియా ఇన్‌చార్జి ఎస్.కె. ముజీబ్, కార్యవర్గ సభ్యులు దాసరి శంకర్, తొర్తి శివ, కొండి సాగర్ లను నియమించారు.

# దుర్గామాత మండపం వద్ద కుంకుమ పూజ

**కోరుట్ల అక్టోబర్ 16 (ఉదయం ప్రతినిధి)**



కథలాపూర్ మండలం సిరికొండ గ్రామంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద శుక్రవారం కుంకుమ పూజా కార్యక్రమం చేపట్టారు ఇట్టి కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కుంకుమ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# క్రీడాకారిణికి ఆర్థిక ప్రోత్సాహకం

**మంథని, అక్టోబర్ 23: ఉదయం ప్రతినిధి**



మంథని నియోజక వర్గం పాలిమెల మండలానికి చెందిన క్రీడాకారిణి కావేరి జ్యోతి నవంబర్ 2026లో జరగనున్న 2వ సౌత్ ఏషియన్ పారా త్రోబాల్ ఛాంపియన్ షిప్‌కు ఎంపికైన సందర్భంగా, ఆమెను ప్రోత్సహించేందుకు ఎం ఆర్ గ్రూప్స్ తరపున డా. ఉదయ్ కిరణ్, కృష్ణ కౌశిక్ కలిసి ₹10,016 (పదివేల పదహారు రూపాయలు) ఆర్థిక ప్రోత్సాహకంగా అందజేశారు. ఈ సందర్భంగా డా. కౌటం ఉదయ్ కిరణ్, కృష్ణ కౌశిక్ మాట్లాడుతూ కావేరి జ్యోతి క్రీడారంగంలో మరిన్ని విజయాలు సాధించి, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆమె క్రీడా ప్రయాణంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకుని, భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని అభిలషించారు.

# గుడ్ల మనోహర్ ను సన్మానించిన సురభి నవీన్ కుమార్



**కోరుట్ల అక్టోబర్ 16 (ఉదయం ప్రతినిధి)**

ఇటీవల తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియామకమైన కోరుట్ల పట్టణానికి చెందిన వ్యాపారవేత్త సామాజిక సేవకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుడ్ల మనోహర్ ని కోరుట్ల పట్టణంలో గల వారి నివాసానికి వెళ్లి ఆత్మీయంగా పలకరించి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్ ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు బిజెపి బిజేవైఎం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీనియర్ పాత్రికేయులు జంగం విజయ్ మృతి

**టీయూడబ్ల్యూజే (ఐజేయు) మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రగాఢ సంతాపం**

**మెట్‌పల్లి అక్టోబర్ 16 (ఉదయం విలేకరి)**



మెట్‌పల్లి పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయులు టీయూడబ్ల్యూజే (ఐజేయు) మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు జంగం విజయ్ అనారోగ్యంతో కన్నుమూశారు జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు ఆయన మృతితో మెట్‌పల్లి పాత్రికేయ రంగంలో విషాదం అలుముకుంది సుదీర్ఘకాలంగా పాత్రికేయ రంగంలో సేవలందించిన జంగం విజయ్ మృతి పట్ల జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు సహచర పాత్రికేయుడిని కోల్పోవడం బాధాకరమని ఆయన మరణం పాత్రికేయ రంగానికి తీరని లోటని పేర్కొన్నారు ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయు) మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బూరం సంజీవ్ కార్యదర్శి మహమ్మద్ అజీమ్ మాట్లాడుతూ జంగం విజయ్ మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఈ విషాద సమయంలో కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు జంగం విజయ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ ఆయన కుటుంబానికి తమ సంఘం అండగా ఉంటుందని వారి దుఃఖంలో భాగస్వాములమవుతున్నామని తెలిపారు ఆయన మృతి పట్ల టీయూడబ్ల్యూజే (ఐజేయు) మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రతినిధులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# పంటలు కాపాడేందుకే ఎస్సారెస్పీ నీటి విడుదల

- ప్రభుత్వాన్ని ఒప్పించి సాగునీరు అందిస్తున్నాం
- రైతుల ప్రయోజనాలే ముఖ్యం..
- ప్రతిపక్షాలది అనవసర రాద్ధాంతం..
- రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు

**పెద్దపల్లి, అక్టోబర్ 16 (ఉదయం ప్రతినిధి)**



పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాలకు డి–83, డి–86 ప్రధాన కాల్వల ద్వారా సరఫరా అవుతున్న సాగునీటిని పెద్దపల్లి పట్టణంలోని చందపల్లి ప్రధాన కాలువ వద్ద శుక్రవారం రోజున స్థానిక నాయకులతో కలిసి పరిశీలించిన గౌరవ ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు. కాల్వల ద్వారా నీటి సరఫరా తీరును పరిశీలించి, పంటలకు చివరి తడులు అందించాల్సిన ప్రస్తుత పరిస్థితులపై గౌరవ ప్రభుత్వ విప్ విజయరమణ రావు గారు వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో పంటలకు నీరు అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సహకారంతో జిల్లా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారి నేతృత్వంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారిని సంప్రదించి ఎస్సారెస్పీ నుంచి నీటి విడుదలకు అంగీకారం పొందినట్లు వివరించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పటికీ రైతుల అవసరాలకు ప్రాధాన్యం ఇచ్చి సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చొరవ చూపిందన్నారు. రైతుల ప్రయోజనాలే తమకు ముఖ్యమని, వారి పంటలను కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తామని ప్రభుత్వ విప్ విజయరమణ రావు గారు స్పష్టం చేశారు. సాగునీటి విషయంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని, ఆ దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. మరోవైపు, సాగునీటి అంశంపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోకుండా విమర్శలు చేయడం సరికాదన్నారు. రైతులకు నీరు అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను గుర్తించాలని సూచించారు. రైతుల సంక్షేమం, పంటల పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతామని ప్రభుత్వ విప్ విజయరమణ రావు గారు పేర్కొన్నారు.

# దుర్గామాతను దర్శించుకున్న ప్రత్యేక పూజలు నిర్వహించిన జువ్వాడి కృష్ణారావు

**కోరుట్ల అక్టోబర్ 16 (ఉదయం ప్రతినిధి)**



దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా కోరుట్ల నియోజకవర్గం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ప్రతిష్ఠించిన దుర్గామాత అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ దుర్గామాత కృపా కటాక్షాలతో వర్షాలు సమృద్ధిగా కురిసి ఒంటరి బాగా పండే ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూడ శ్రీకాంత్ రెడ్డి మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎల్లాల వెంకటరెడ్డి సునీత సుగుణ కర్ రావు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు మాజీ సర్పంచ్ లు మాజీ ఎంపీటీసీలు కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు యువజన కాంగ్రెస్ మహిళా కాంగ్రెస్ ఎం ఎస్ యు ఐ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భీముని దుబ్బ ప్రాంతంలో దుర్గామాత మండపం వద్ద కుంకుమ పూజ

**కోరుట్ల అక్టోబర్ 16 (ఉదయం ప్రతినిధి)**



కోరుట్ల పట్టణంలోని భీముని దుబ్బ ప్రాంతంలో గల శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద శుక్రవారం కుంకుమ పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా మహిళలు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ కౌన్సిలర్ రేంజర్ల కళ్యాణి కాంగ్రెస్ నాయకులు వెంకటేష్ మేకల నర్సయ్య విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# భూముల రీ సర్వేలు పరిశీలించిన అదనపు కలెక్టర్ ప్రసూనాంబ



**కోరుట్ల అక్టోబర్ 16 (ఉదయం ప్రతినిధి)**

కోరుట్ల మండలం ధర్మారం గ్రామంలో ప్రభుత్వం చేపడుతున్న భూ రి సర్వే ను పరిశీలించేందుకు అదనపు కలెక్టర్ రెవెన్యూ ప్రసూనాంబ ధర్మారం గ్రామానికి విచ్చేయంగా స్థానిక సర్పంచ్ రంజిత్ రెడ్డి పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు అనంతరం గ్రామంలో జరుగుతున్న భోరి సర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే పనుల పురోగతిని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డిఓ జివాకర్ రెడ్డి తహసిల్దార్ కృష్ణ చైతన్య సర్వేయర్లు గ్రామ రైతులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# జువ్వాడి నర్సింగరావు ను మర్యాదపూర్వకంగా కలిసిన సీఐ తిరుపతి

**కోరుట్ల అక్టోబర్ 16 (ఉదయం ప్రతినిధి)**

కోరుట్ల పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కొమ్ము తిరుపతి శుక్రవారం తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావును మెట్ పల్లి పట్టణంలో జువ్వాడి నర్సింగరావు స్వగృహం జువ్వాడి భవన్ లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



# అమ్మవారిని దర్శించుకున్న ఆది శ్రీనివాస్

**కోరుట్ల అక్టోబర్ 16 (ఉదయం ప్రతినిధి)**

కథలాపూర్ మండలం కలికోట గ్రామంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొలువుదీరిన దుర్గాదేవి అమ్మవారిని శుక్రవారం ప్రభుత్వ విప్ వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా మండపంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆది శ్రీనివాస్ అమ్మవారి ఆశీస్సులు పొందారు అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని గ్రామాలు అభివృద్ధి చెందాలని రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్టు తెలిపారు ఈ కార్యక్రమంలో పలువు సర్పంచులు కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఆశ్వీయుజ మాసం షష్టి సందర్భంగా ప్రత్యేక కుంకుమ పూజలు

**అమ్మ వారికి ముడుపు సమర్పణ**

**జగిత్యాల అక్టోబర్ 16 (ఉదయం ప్రతినిధి)**

జగిత్యాల పట్టణ చింతకుంట లోని శ్రీ సూర్య ధన్వంతరి ధనలక్ష్మి సహిత దేవాలయంలో శ్రీ ధనలక్ష్మి సేవా సమితి అధ్వర్యంలో తేదీ 16 10 2026 ఆశ్వీయుజ మాసం శుక్రవారం షష్టి పర్వ దినాన్ని పురస్కరించుకొని మాతలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, లలితా సహస్ర నామాల స్తోత్ర పారాయణం చేపట్టారు పారాయణం అనంతరం మాతలు అమ్మ వారికి ఒడి బియ్యం సమర్పించారు కుంకుమ పూజ అనంతరం లక్కీ డిప్ ద్వార ఒక్కరిని ఎంపిక చేసి వారికి అమ్మ వారి శేషవస్త్రం అమ్మ వారి ప్రసాదం తాంబూలం ఆలయ పూజారి ఆశీర్వచనంతో అందజేశారు . కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ వడ్లగట్ల రాజన్న వర్కింగ్ ప్రెసిడెంట్ వొద్నాల శ్రీనివాస్ మహిళా సభ్యులు జ్యోతి స్వప్న లక్ష్మి లత అనూష్క గంగమ్మ అర్చకులు శ్రీహరి పాల్గొన్నారు.

# దసరా బతుకమ్మ పండుగల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన జువ్వాడి నర్సింగరావు

**ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్నీ ఏర్పాటు చేయాలి**

**మెట్పల్లి అక్టోబర్ 16 (ఉదయం విలేకరి)**



మెట్‌పల్లి పట్టణంలోని మార్కెట్ యార్డులో దసరా ఉత్సవాలు నిర్వహించే ప్రదేశాన్ని మహాలక్ష్మి అమ్మవారి ఆలయం సమీపంలోని బతుకమ్మ నిమజ్జన స్థలాన్ని తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ రావు మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించారు ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ దసరా బతుకమ్మ పండుగలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకునేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు పండుగలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మున్సిపల్ పోలీస్ అధికారులకు తెలిపారు ముఖ్యంగా పండుగ ప్రదేశాల్లో పారిశుధ్యం తాగునీరు విద్యుత్ దీపాలు ట్రాఫిక్ నియంత్రణ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

# దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకున్న జువ్వాడి నర్సింగరావు

**మల్లాపూర్ అక్టోబర్ 16 (ఉదయం విలేకరి)**



మల్లాపూర్ మండలం రాఘవపేట గ్రామంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా దుర్గాదేవి సేవా సమితికి 800 స్టీల్ ప్లేట్లను విరాళంగా అందించిన నత్తి శేఖర్ (విజన్ స్కూల్ కరస్పాండెంట్) నత్తి రాము – లక్ష్మణ్ (1వ అండ్ 8వ వార్డు సభ్యులు) అభినందనీయులు తమ తండ్రి స్వర్గీయ నత్తి లక్ష్మీరాజాం జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని అందజేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు చేతుల మీదుగా దుర్గాదేవి సేవా సమితికి స్టీల్ ప్లేట్లను అందజేశారు అనంతరం జువ్వాడి నర్సింగ రావు దుర్గా మాత అమ్మవారి కృపా కటాక్షాలతో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో రాఘవపేట గ్రామ ప్రజలు నాయకులు పాల్గొన్నారు.

# రీ సర్వే పనులను పకడ్బందీగా వేగవంతంగా పూర్తి చేయాలి

- నాన్ కెడస్ట్రాల్ రిసర్వే ఎంజాయ్మెంట్ రీ సర్వే పనుల పరిశీలన
- ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రచార కార్యక్రమాన్ని పరిశీలన
- కోరుట్ల మండలంలోని 103, 104, 105, 106 పోలింగ్ కేంద్రాలను పరిశీలన
- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్ ప్రసూనాంబ

**కోరుట్ల అక్టోబర్ 16 (ఉదయం ప్రతినిధి)**



కోరుట్ల మండలంలోని ధర్మారం గ్రామంలో నాన్ కెడస్ట్రాల్ రీసర్వే ఎంజాయ్ మెంట్ రీ సర్వే పనులను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్ ప్రసూనాంబ శుక్రవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు రీ సర్వే ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా పకడ్బందీగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు ఈ సందర్భంగా గ్రామంలో ఇప్పటివరకు ఎంత విస్తీర్ణంలో రీ సర్వే పూర్తయింది ఇంకా ఎంత మేర చేపట్టాల్సి ఉంది పనులు ఎన్ని రోజుల్లో పూర్తవుతాయనే వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు ఆయా గ్రామాల్లో భూమి విస్తీర్ణం ఎంత ఉందని ఆరా తీశారు సర్వే నంబర్ల వారీగా ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితత్వంతో రీ సర్వే నిర్వహించాలని సూచించారు భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భూముల రీ సర్వే కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు ఈ రీసర్వేలో భాగంగా గ్రామ సరిహద్దులను నిర్ధారించి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అత్యాధునిక సర్వే పరికరాల సహాయంతో వ్యవసాయ భూములను సర్వే చేయనున్నట్లు తెలిపారు సర్వే పూర్తయిన అనంతరం భూ వివరాలను ప్రజలకు ప్రకటిస్తామని పేర్కొన్నారు గ్రామస్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా రీ సర్వే ప్రక్రియను నిర్వహించాలని ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు మొదట గ్రామ బౌండరీ పై లైసెన్సుడ్ సర్వేయర్లు మండల సర్వేలు కలిసి రీ సర్వే చేస్తారని తర్వాత ఒక్కొక్క రైతు వారిగా రీ సర్వే నిర్వహిస్తారని తెలిపారు.

**అనంతరం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పరిశీలన**

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రచార కార్యక్రమంలో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్ ప్రసూనాంబ కోరుట్ల మండలంలోని పోలింగ్ కేంద్రాల నంబర్లు 103, 104, 105, 106లను సందర్శించి కార్యక్రమ నిర్వహణను పరిశీలించారు ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితా సవరణకు సంబంధించి చేపడుతున్న కార్యక్రమాలను ఓటర్లకు అందిస్తున్న సేవలను పరిశీలించారు అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం స్వీకరించేలా సంబంధిత అధికారులకు సూచించారు ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ఓటర్లందరికీ ఓటరు జాబితాలో చోటు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి తహసీల్దార్ కృష్ణ చైతన్య సంబంధిత అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.